ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 27 డిసెంబరు 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.0 । కనిష్ఠం 19.0

మననం 2024

ఏడాదంతా రాజకీయమే

- కాంగ్రెస్‌లో నియామకాల సందడి
- నల్లగొండ ఎంపీగా రఘువీర్‌కు రికార్డు స్థాయి మెజార్టీ
- డీసీసీబీ చైర్మన్‌గా కుంభం శ్రీనివా‌స్‌రెడ్డి ఎన్నిక
- సూర్యాపేట, ఆలేరు మినహా మునిసిపాలిటీలన్నీ కాంగ్రెస్ ఖాతాలోకి
- జిల్లాలో అభివృద్ధి పనులు ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- మూసీ ప్రక్షాళనకు సంకల్ప యాత్ర
- కృష్ణాజలాలపై నల్లగొండలో మాజీ సీఎం కేసీఆర్ సభ



మూసీ ప్రక్షాళన సంకల్ప పాదయాత్రలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డి (ఫైల్)

చూస్తుండగానే కాల చక్రం గిర్రున తిరిగింది. రాజకీయంగా మరచిపోలేని ఎన్నో ఘటనలను మిగిల్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక లోక్‌సభ ఎన్నికలు ఎదుర్కొంది. ఈ ఏడాది మార్చి 16 నుంచి జూన్ 16వ తేదీ వరకు లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంది. నల్లగొండ ఎంపీగా కుందూరు రఘువీర్‌రెడ్డి దక్షిణ భారత దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిచారు. ఆ తరువాత అక్టోబరు 7న శాసనమండలి పట్టభద్రుల స్థానానికి ఉప ఎన్నిక కోడ్ రాగా, నవంబరు 6న ఓట్ల లెక్కింపు నిర్వహించారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) గెలుపొందారు. తదనంతరం రాష్ట్ర కార్పొరేషన్ల మొదలు, మార్కెట్ కమిటీల నియామకాల వరకు నామినేటెడ్ పదవుల పందేరం కొనసాగింది. ఏడాది కాలమే ఉన్నా మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాల ద్వారా బీఆర్ఎస్ చైర్మన్లను గద్దెదించి మెజారిటీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకొంది. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల పాలకవర్గాలకు పదవీకాలం ఈ ఏడాదే ముగిసింది.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

●7లో..



కృష్ణానది జలాల హక్కుల పరిరక్షణ సభలో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్ (ఫైల్)

భక్తుల మనోభీష్టమే ప్రధానం



గుట్ట నృసింహుడి సన్నిధిలో అయ్యప్ప భక్తుల గిరిప్రదక్షిణ (ఫైల్)

- కొత్త ప్రభుత్వం రాకతో గుట్టపై పలు సౌకర్యాల కల్పన
- పాత ఆచారాల పునరుద్ధరణ, ప్రారంభమైన గిరి ప్రదక్షిణ
- దివ్య విమాన బంగారం తాపడం పనులు షురూ
- యాదగిరి క్షేత్రానికి భద్రతాపరంగా హైసెక్యూరిటీ
- తెలంగాణ తిరుపతిగా, ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా
- నృసింహుడి ఆలయానికి పెరుగుతున్న భక్తుల సంఖ్య



గుట్ట ఆలయంలో భక్తుల రద్దీ (ఫైల్)

శతాబ్దాల చరిత్ర ఉన్న మహిమాన్విత స్వయంభు యాదగిరిగుట్ట దివ్యక్షేత్రం పునర్నిర్మాణం, ఉద్ఘాటన అనంతరం ఆధ్యాత్మిక నగరిగా కొత్తరూపు సంతరించుకుంది. నాటి నుంచి స్వామివారిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఇంకా కొన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిపై దృష్టిసారించింది. ఏళ్లుగా ఉన్న పాత ఆచారాలను పునరుద్ధరించింది. గతంలో స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు గుట్టపై నిద్రచేసి మొక్కు చెల్లించేవారు. ఆలయ ఉద్ఘాటన అనంతరం ఈ సౌకర్యం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం భక్తులు నిద్ర చేసేలా డార్మెటరీ హాల్‌ను అందుబాటులోకి తెచ్చింది. అదేవిధంగా ఏళ్లుగా కొనసాగిన గిరిప్రదక్షిణను తిరిగి ప్రారంభించింది. దీంతోపాటు కొండపైకి ఆటోలను అనుమతించారు. ఇక స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఏర్పాటుచేసిన పీటలపై ప్రొటోకాల్ వివాదం చెలరేగగా, అప్పటి వరకు ఉన్న ఆలయ ఈవో గీతారెడ్డిపై ప్రభుత్వం వేటు వేసింది.

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి

●6లో..

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- రేపు నల్లగొండలో జోడో ర్యాలీ, బహిరంగ సభ
- హాజరుకానున్న మంత్రి కోమటిరెడ్డి
- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల, మునిసిపల్ చైర్మన్ బుర్రి

నల్లగొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 28న జిల్లా కేంద్రంలో జోడో ర్యాలీ, గడియారం సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పట్టణశాఖ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జోడో ర్యాలీ, బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటారని, బీజేపీ ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందన్నారరు. పదేళ్లుగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క వర్గానికి కూడా న్యాయం చేయలేదని విమర్శించారు. పార్టీ జాతీయ నాయకురాలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతోందన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏడాది కాలంగా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ ప్రజాపాలన సాగిస్తున్నారని తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతతత్వ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నాయకత్వంలో నల్లగొండ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, ఉమ్మడి జిల్లా అభివృద్ధితో పాటు రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఈనెల 28న మధ్యాహ్నం 3గంటలకు ఎన్‌జీ కళాశాల నుంచి ప్రతీ నాయకుడు, కార్యకర్త చేతిలో జెండా పట్టుకొని క్రమశిక్షణతో నడుచుకుంటూ ర్యాలీలో పాల్గొంటారన్నారు. ర్యాలీ శివాజీనగర్, రామగిరి, బస్టాండ్, ప్రకాశం బజార్ మీదుగా గడియారం సెంటర్‌కు చేరుకుంటుందని, సాయంత్రం 5గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ సభకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ మాట్లాడారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, నాయకులు వంగూరి లక్ష్మయ్య, గడ్డం అనూప్‌రెడ్డి, జూలకంటి సైదిరెడ్డి, నాగరాజు, సతీష్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.



ఆవిర్భావ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా

- ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తాం
- 30న నల్లగొండలో రాష్ట్రస్థాయి బహిరంగ సభ
- జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వంపై ఒత్తిడి
- కాలుష్యరహిత, ఉపాధి కల్పనకు తోడ్పడే పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- 'ఆంధ్రజ్యోతి'తో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

నల్లగొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. సీపీఐ వందేళ్ల ప్రస్థానం నేపథ్యంలో ఈనెల 30న నల్లగొండలో పార్టీ రాష్ట్రస్థాయి బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్య రంగాల్లో సమస్యలు, పారిశ్రామిక కాలుష్యంపై పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే అంతిమ లక్ష్యంగా ముందుకెళ్తామంటున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో విశేషాలు ఇలా..

ఆంధ్రజ్యోతి: రాష్ట్రస్థాయి బహిరంగసభ ద్వారా ఇచ్చే సందేశమేంటి?

సత్యం: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీపీఐకి ఘనమైన ఉద్యమచరిత్ర ఉంది. నిజాం విముక్తి పోరాటం, తెలంగాణ సాయుధ పోరాటంలో జిల్లాలో సీపీఐదే అగ్రస్థానం. రాష్ట్రంలో అత్యధికంగా పేదలకు భూములు పంచిన సీపీఐ, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతోంది. దేశంలో పెచ్చరిల్లుతున్న మతతత్వ, కార్పొరేట్ శక్తులను నియంత్రించేందుకు ప్రజాస్వామికవాదులు, కమ్యూనిస్టులు ఐక్యంగా పోరాడాలనే సందేశాన్ని ఈ బహిరంగ సభ ద్వారా ఇవ్వనున్నాం.

ఆం: బహిరంగసభకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

సత్యం: బహిరంగసభకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి సీపీఐ కార్యకర్తలు తరలివస్తారు. సుమారు 20వేలమంది వరకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో నిర్వహించే ఈ సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇతర ముఖ్యనేతలంతా రానున్నారు. కళాజాతాలు, ప్రదర్శనలుంటాయి. సభను విజయవంతం చేయడం ద్వారా ఉమ్మడి జిల్లాలో పార్టీ శ్రేణుల్లో పునరుత్తేజం కల్పిస్తాం.

ఆం: ఉమ్మడి జిల్లాలో మీ కార్యాచరణ ఏంటి?

సత్యం: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సీపీఐ మొదటి నుంచి పోరాడుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలోని



ఇంటర్వ్యూ Interview

సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొంత కదలిక రావడం హర్షనీయం. కీలకమైన ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ పనులను వేగంగా పూర్తిచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం. అదేవిధంగా మూసీకాల్వల

మిగతా 8వ పేజీలో...

నేడు బెటాలియన్‌లో పాసింగ్ అవుట్ పరేడ్

హాజరు కానున్న ఐజీ రమేష్

నల్లగొండ క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికై నల్లగొండ పట్టణ పరిధిలోని 12వ బెటాలియన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శుక్రవారం ఉదయం పాసింగ్ అవుట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు 12వ బెటాలియన్ కమాండెంట్ కె.వీరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఎస్పీసీగా ఎంపికైన మొత్తం 450 మంది (వికారాబాద్ 107 మంది, కామారెడ్డి 129 మంది, రామగుండం 214 మంది) కానిస్టేబుళ్లకు తొమ్మిది నెలలుగా బెటాలియన్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. కఠోరమైన ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకున్నారని, ఈ కాలంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐజీ ఎం.రమేష్ హాజరవుతారని తెలిపారు. శుక్రవారం ఉదయం 8.15 గంటలకు దీక్షాంత్ పరేడ్ ప్రారంభంకానున్నట్లు తెలిపారు.

నేడు జిల్లాకు నారా భువనేశ్వరి

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



నల్లగొండ, దామరచర్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి నల్లగొండ జిల్లాకు శుక్రవారం రానున్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని దామచర్ల మండలం పుట్లగడ్డ తండాలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొననున్నారు. అదేవిధంగా ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడంతోపాటు ఎన్టీఆర్ సుజల వాటర్ ప్లాంట్‌ను నారా భువనేశ్వరి ప్రారంభిస్తారని టీడీపీ నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి తెలిపారు. నారా భువనేశ్వరి పాల్గొనే కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రధానికే నేరుగా ఫిర్యాదు

- డిజిటల్ ఇండియాతో పారదర్శక పాలన
- ఆన్‌లైన్‌లో పీఎంకు ఫిర్యాదు చేసుకునేందుకు వెబ్‌సైట్
- దేశంలో ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేసే అవకాశం
- పీఎం ఇండియా పేరుతో ప్రత్యేక పోర్టల్
- ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం
- ఇతర సమస్యలపై ఫిర్యాదుకు అవకాశం



"సాంకేతిక పరిజ్ఞానాన్ని సరిగా వినియోగించుకుంటే అవినీతిని అంతం చేయవచ్చు. దీనికి యువత ముందుకు రావాలి. సుపరిపాలనను సుసాధ్యం చేయాలి."
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్ష

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

ప్రభుత్వ పథకాలు పేదలకు అందడం లేదా?, ప్రభుత్వ సేవలు సకాలంలో అందటం లేదని భావిస్తున్నారా?, అధికారులు అవినీతికి పాల్పడుతూ అర్హత ఉన్నా పనులు చేయకుండా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారా? అయితే తక్షణ పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారా అయితే ఇది తెలుసుకోండి. ప్రభుత్వ పాలనలో పారదర్శకతను అందిపుచ్చుకునేందుకు దేశ ప్రజలు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించింది. దేశంలో ఎక్కడి నుంచైనా, ఎవరైనా తమ ఫిర్యాదులను పంపడానికి ప్రత్యేక పోర్టల్ 'పీఎంఇండియా' పేరుతో ఏర్పాటు చేసింది. ఈ పోస్టల్ ద్వారా నేరుగా ప్రధాన మంత్రి కార్యాలయానికే ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం www.pmindia.gov.inకు లాగిన్ అవ్వాల్సి ఉంటుంది.

డిజిటల్ ఇండియాలో భాగంగా

పౌరసేవలు అందడం లేదని సకాలంలో అందడంలేదని కిందిస్థాయి ఉద్యోగిపై ఉన్నతాధికారికి ఫిర్యాదు చేయాలన్నా ప్రత్యేక అర్జీ పట్టుకుని రోజుల తరబడి వేచిఉండాలి. ఈ విషయాన్ని ఏ ప్రజా ప్రతినిధికో తెలియజేయాలన్నా మరో అర్జీ రాసి కాళ్లరిగేలా తిరగాలి. ఇలాంటి సమస్యల పరిష్కారానికి డిజిటల్ ఇండియా పేరుతో ప్రధానమంత్రి ప్రయత్నాలు చేస్తున్నారు. కాగితంపై రాసి పోస్టు చేసి సమాధానం వస్తుందని ఎదురుచూడాల్సిన రోజులు ఇక లేవు. డిజిటల్ ఇండియాలో భాగంగా కాగిత రహిత పాలనను కేంద్రం తీసుకువచ్చింది. ప్రత్యేక పోర్టల్‌ను వజ్రాయుధంగా వినియోగించుకోవడానికి పౌరులకు అవకాశం కల్పించింది.

ఫిర్యాదుకు అవకాశం ఇచ్చిన అంశాలు ఇవే!

ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం, పర్యావరణ సమస్యలు, ఆర్థిక శాఖకు సంబంధించిన అంశాలు, పోలీసు సేవలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల పనితీరు, విద్య, మహిళలకు వేధింపులు, గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి, రైల్వే సేవలు, వ్యవసాయం, భూసమస్యలు, కార్మిక సమస్యలపై ఫిర్యాదుకు అవకాశం ఉంది.

ఇలా లాగిన్ కావాలి!

ఇంటర్నెట్‌లోకి వెళ్లి www.pmindia.gov.inకు లాగిన్ అవ్వాలి. ఇంటరాక్ట్ విత్ పీఎంపై క్లిక్ చేయాలి. దీనిలో అడిగిన విధంగా ఆయా సమాచారాన్ని, ఫిర్యాదు దారుడి పేరు, చిరునామా పూరించాలి. ఫిర్యాదులో ప్రాధాన్యాంశాలు వస్తాయి. వాటిపై క్లిక్ చేయాలి. వీలైనంత క్లుప్తంగా ఫిర్యాదు ఉండాలి. అన్ని వివరాలను నమోదు చేశాక సబ్‌మిట్ బటన్‌పై క్లిక్ చేయాలి. మన సమస్య పరిష్కారం కోసం నీ మెయిల్‌ఐడీ లేదా మొబైల్‌కు సమాచారం పంపుతారు. ఫిర్యాదులను ఇంగ్లీష్ లేదా హిందీలో పంపాల్సి ఉంటుంది.

చికిత్స పొందుతూ గీత కార్మికుడి మృతి



చిన్నవెంకటయ్య(ఫైల్)

తిరుమలగిరి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలో తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వెలిశాల గ్రామానికి చెందిన గీత కార్మికుడు గడ్డం చిన్నవెంకటయ్య(53) కల్లుగీత కోసం సోమవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కుతుండగా జారిపడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. చిన్నవెంకటయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చిన్నవెంకటయ్య కుటుంబానికి తక్షణ సహాయం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం మండల కార్యదర్శి సోమయ్య, సొసైటీ అధ్యక్షులు దూపటి రాములు, ఆకుల వీరయ్య కోరారు.

'భూభారతి'తో మహర్దశ

- సాదాబైనామాల దరఖాస్తు రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- దరఖాస్తులకు పరిష్కారం చూపనున్న రాష్ట్ర ప్రభుత్వం
- నాలుగేళ్ల నిరీక్షణకు దక్కనున్న ఫలితం



సూర్యాపేట సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా భూభారతి చట్టం తీసుకువస్తున్న నేపథ్యంలో సాదాబైనామా దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తెల్లకాగితంపై జరిగిన భూక్రయవిక్రయాల క్రమబద్ధీకరణకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2019లో దరఖాస్తులు ఆహ్వానించి, భూపట్టాలు పంపిణీ చేసింది. ఆ తర్వాత 2020 అక్టోబరులో మరోసారి ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం కల్పించింది. ఆ సమయంలో రైతులు రూ.300 నుంచి రూ.500లు వరకు చెల్లించి, మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. దాదాపుగా మూడేళ్ల క్రితం స్వీకరించిన సాదాబైనామా దరఖాస్తులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఏళ్లు గడుస్తున్నా సాదాబైనామా ప్రక్రియ మాత్రం ముందుకు సాగలేదు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. తాజాగా ధరణి స్థానంలో కొత్త ఆర్వోఆర్ చట్టం(భూభారతి-2024)ను తీసుకువచ్చింది. ఈ చట్టం ద్వారా సాదాబైనామా దరఖాస్తులకు సంబంధించి భూపట్టాల జారీ వేగవంతం చేయనుంది. సూర్యాపేట జిల్లావ్యాప్తంగా సాదాబైనామా కింద 81,628 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

నేటికీ భూపట్టాలు లేని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సాదాబైనామా పట్టాలు ఇవ్వడానికి అవకావశం కల్పించింది. 2019లో మొదటిసారి సాదాబైనామా ప్రక్రియను ప్రారంభించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు తీసుకుని ప్రతి రైతుకూ భూపట్టాలను మంజూరు చేసింది. మరోమారు 2020 అక్టోబరు నుంచి నవంబరు వరకు రెండో దఫా రైతుల నుంచి ఆన్‌లైన్‌లో సాదాబైనామాలపై దరఖాస్తులు తీసుకుంది. అయితే వేలసంఖ్యలో వచ్చిన దరఖాస్తులకు నేటికీ పరిష్కారం లభించలేదు. సాదాబైనామాలను పరిశీలించి, భూపట్టాలిస్తామని ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నాయకులు హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ఓడి కాంగ్రెస్ అధికారంలోకి రావడం, నూతన ఆర్వోఆర్ చట్టం(భూభారతి) ద్వారా భూసమస్యలను పరిష్కారిస్తామని పలుమార్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించడంతో మారోమారు సాదాబైనామా దరఖాస్తులపై చర్చ మొదలై రైతులలో ఆశలు చిగురిస్తున్నాయి.

రైతుల ఎదురుచూపులు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకన్నా ముందే తెల్లకాగితంపై భూక్రయవిక్రయాలు చేసుకున్న రైతులు ఆ భూమిపై తమకే సర్వహక్కులు అన్న నమ్మకంలో ఉండి, కొనుగోలుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. భూకొనుగోళ్లకు సంబంధించిన వివరాలను కనీసం గ్రామ రెవెన్యూ అధికారికి కూడా తెలపకుండా కబ్జాలో ఉండి ఆ భూముల్లో వ్యవసాయం చేసుకుంటు వస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 కంటే ముందు కబ్జాలో ఉండి

రైతులకు అందని ప్రభుత్వ ఫలాలు

సాదాబైనామాలకు సంబంధించి భూపట్టాలు పంపిణీ చేయకపోవడంతో చాలామంది రైతులు ప్రభుత్వ సాయాన్ని పొందలేకపోయారు. కొన్నేళ్లుగా కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్నా ఆ భూములకు సంబంధించి డిజిటల్ పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి అందజేస్తున్న సంక్షేమ ఫలాలను పొందలేకపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందజేసిన రైతుబంధు పథకం, కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి(ఏడాదికి రూ.6వేలు) వంటి పథకాలకు రైతులు దూరమయ్యారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న భూభారతి ద్వారా ఐదేళ్లుగా పెండింగ్ ఉన్న సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం కలుగనుంది. మరోకొద్ది రోజుల్లో భూభారతి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన వెంటనే తొలివిడతగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులపై దృష్టి సారించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా డిజిటల్ పాస్‌పుస్తకాలు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో భూములు విక్రయించిన వారసులతో రైతులకు ఇబ్బందులు కూడా తలెత్తిన దాఖాలాలు లేకపలేదు. కొన్ని భూపంచాయితీలు పోలీస్‌స్టేషన్ల వరకూ వెళ్లాయి. కొన్నిసార్లు తెల్ల కాగితాలు, బాండ్ పేపర్లపై భూములు కొనుగోలు చేసిన వారి నుంచి తిరిగి భూములు తీసుకోవడానికి ప్రయత్నించారు. ఈ తరహా సమస్యలకు నూతన ఆర్వోఆర్ చట్టం చెక్ పెట్టనుంది.

రెవెన్యూ శాఖ పటిష్ఠతకు చర్యలు
వీఆర్వో వ్యవస్థ పునరుద్ధరణకు కసరత్తు

మోత్కూరు, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రెవెన్యూ చట్టంలో అనేక మార్పులు తీసుకువస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి స్థానంలో గతేడాది ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం 'భూభారతి'ని తెచ్చి ఆ బిల్లును అసెంబ్లీ ఆమోదించింది. ఈ చట్టం సమర్థంగా అమలుచేసేందుకు తగినంత మంది గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో వీఆర్వో వ్యవస్థ పునరుద్ధరణకు సిద్ధమైంది.

2007లో ప్రారంభమై 2020లో రద్దు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007 అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అప్పటి గ్రామకార్యదర్శులను వీఆర్వోలుగా గుర్తించి గ్రామరెవెన్యూ బాధ్యతలు అప్పగించారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ధరణిని తీసుకవచ్చింది. రెవెన్యూశాఖలో జరుగుతున్న మోసాలు, అవినీతికి వీఆర్వోలే కారణమన్న తలంపుతో 2020లో ఆ వ్యవస్థను రద్దు చేసింది. వీఆర్వోలను 36 ప్రభుత్వశాఖల్లోకి పంపింది. ఆ తర్వాత 2023 ఆగస్టులో వీఆర్వోలను వారి విద్యార్హతను బట్టి మునిసిపల్, మిషన్ భగీరథ, నీటి పారుదల శాఖలకు బదిలీచేసింది.గ్రామాల్లో భూరికార్డులపై అవగాహన ఉన్న వారందరినీ ఇతరశాఖలకు పంపడంతో గ్రామాల్లో భూవివాదాలు పెరిగాయి. వివాదాల పరిష్కారం కోసం రైతులు రెవెన్యూ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతూ ఖర్చుల పాలవుతున్నారు.

మాజీ వీఆర్వోలకు ఆప్షన్లు ఇవ్వడానికి రేపటితో ఆఖరు

భూభారతి చట్టం అమలు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థ పునరుద్ధరణకు పూనుకుంది. ఇందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న మాజీ వీఆర్వోలు తిరిగి రెవెన్యూ శాఖలోకి రావాలన్న ఆసక్తి ఉంటే ఈ నెల 28లోపు యాప్‌లో ఆప్షన్ తెలియజేయాల్సి ఉంటుంది. ఇప్పటికే పలువురు తిరిగి రెవెన్యూ శాఖలోకి రావడానికి యాప్ ద్వారా తమ సమ్మతిని తెలిపినట్లు సమాచారం.

రెవెన్యూలోకి తీసుకోవాలి



డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి పరీక్ష పెట్టి వీఆర్వోలుగా ప్రభుత్వం తీసుకోవాలనుకుంటోంది. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, ప్రభుత్వ రిక్రూట్‌మెంటు ద్వారా వచ్చిన వీఆర్ఏలు పలువురు వివిధ శాఖల్లో సర్దుబాటయ్యారు. మాజీ వీఆర్ఏలకు అనుభవం ఉన్నందున ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారిని వీఆర్వోలుగా తీసుకోవాలి.

దాసరి వీరన్న, మాజీ వీఆర్ఏల సంఘం రాష్ట్ర కోచైర్మన్

గతంలో ఉమ్మడి జిల్లాలో 2,325 మంది వీఆర్వో, వీఆర్ఏలు

జిల్లా	వీఆర్ఏలు	వీఆర్వోలు	మండలాలు	సర్వేయర్లు
యాదాద్రి	654	163	17	16
నల్లగొండ	758	215	31	20
సూర్యాపేట	425	110	23	14

(వీఆర్వో, వీఆర్ఏల వివరాలు గతానివి)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో వీఆర్ఏలు1837, వీఆర్వోలు 488 మంది ఉండేవారు. వీరంతా ఇతర ప్రభుత్వ శాఖల్లోకి వెళ్లిపోయారు. మండలానికి ఒక సర్వేయర్ ఉండాల్సి ఉండగా ఏ జిల్లాలోనూ పూర్తిస్థాయిలో సర్వేయర్లు లేరు. దీంతో భూమి సర్వే కోసం వచ్చిన దరఖాస్తులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. భూభారతి చట్టం పకడ్బందీగా అమలు జరగాలంటే గ్రామానికి ఒక వీఆర్వో, మండలానికి ఒక సర్వేయర్ అవసరం. ఇది ఇలా ఉండగా గ్రామాల్లో భూ వివాదాలకు భూముల సరిహద్దులు సక్రమంగా లేకపోవడం, భూముల మ్యాపులు లేకపోవడం కారణమంటున్నారు. నిజాం కాలంలో సర్వే చేసి నాటిన హద్దురాళ్లే తప్ప మళ్లీ భూసర్వే జరుగలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా భూముల రీసర్వే చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



క్రిమిసంహారక మందువల్లే కూలీలకు అస్వస్థత



దర్యాప్తు వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ చాణక్య

శాలిగౌరారం డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈత చెట్టుకు పెట్టిన క్రిమిసంహారక మందు వర్షానికి ఈతకల్లులో కలవడంతోనే కల్లు తాగిన కూలీలు అస్వస్థతకు గురయ్యారని నల్లగొండ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ చాణక్య తెలిపారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారంలో బుధవారం సాయంత్రం ఈతకల్లు తాగి కూలీలు అస్వస్థతకు గురైన సంఘటనపై గురువారం క్షేత్రస్థాయిలో దర్యాప్తు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన గీత కార్మికుడు పల్స వెంకన్న ఈ నెల 22వ తేదీన పురుగుల మూలంగా ఈత చెట్టు చనిపోతుందని ఉద్దేశంతో పొలంలో వాడే క్రిమిసంహారక మందును చెట్టు మొగిలిలో చల్లారు. ఈ నెల 24వ తేదీన వర్షం కారణంగా ఆ పురుగుల మందు ఈ గెల వెంట లొట్టిలో పడింది. ఈ నెల 25న గ్రామానికి చెందిన పాక పిచ్చయ్య, దుబ్బాక అచ్చయ్య, వల్లపు లింగయ్య, గంట రామచంద్రయ్య, మేడిపల్లి బిక్షం కన్నెబోయిన నరేష్ ఈత కల్లు కావాలని అడగడంతో వెంకన్న కల్లు పోశాడు. ఆ కల్లును తాగిన వారు అస్వస్థతకు గురై వాంతులు విరోచనాలు చేసుకున్నారని వెంటనే కుటుంబసభ్యులు వారిని ఆసుపత్రికి తరలించారన్నారు. చికిత్సపొందుతున్న వారిలో పాక పిచ్చయ్య, దుబ్బాక అచ్చయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. ఘటనపై దర్యాప్తులో భాగంగా గీత కార్మికుడు వెంకన్నను విచారించగా మొగిలిలో చెట్టు కోసం పురుగులు మందు పెడుతున్నట్లు అంగీకరించాడన్నారు.వర్షంతో ఆ మందు కల్లు కుండలోకి వచ్చి చేరినట్లు వివరించాడన్నారు. అతని వద్ద నుంచి లీటరు కల్లు కుండ, కల్లుపోసిన ఖాళీ ప్లాస్టిక్ క్యాన్, క్రిమిసంహారక డబ్బా స్వాధీనం తీసుకుని పరీక్షల కోసం ల్యాబోరేటరీకి పంపించామన్నారు. ఈ ఘటన విషయంలో వెంకన్నపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు చాణక్య తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ మల్లయ్య, నకిరేకల్ ఎస్ఐ చాంద్‌బీ పాల్గొన్నారు.

ఒకరు డిచార్జి

ఈత కల్లు తాగి తీవ్ర అస్వస్థత గురై నకిరేకల్‌లో చికిత్స పొందుతున్న వారిలో కన్నెబోయిన నరేష్‌ను గురువారం డిచార్జి చేశారు. వల్లపు లింగయ్య, గంట రామచంద్రయ్యలు ఆరోగ్యం కుదట పడింది. మేడిపల్లి బిక్షంను నల్లగొండలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దుబ్బాక అచ్చయ్య, పాక పిచ్చయ్యలకు హైదరాబాద్‌లోని వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తుండగా వీరి పరిస్థితి విషమంగానే ఉంది. ఎమ్మెల్యే వేముల వీరేశం నకిరేకల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆందోళనకారులపై కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):ఓ ప్రార్థన స్థలం వద్ద ఆందోళన చేసిన అయ్యప్పభక్తులపై కేసులు నమోదు చేసినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు. చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన బాలాజీనాయక్, లక్ష్మీ దంపతులు కిడ్స్‌రెడ్ స్కూల్ పేరుతో విద్యార్థులకు ట్యూషన్లు, మహిళలకు కుట్టుమిషన్లు శిక్షణ ఇస్తున్నారు. క్రిస్మస్ పండుగ బుధవారం స్కూల్‌లో ప్రార్థన నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన అయ్యప్పభక్తులు, మరికొందరు ప్రార్థనాస్థలంలోకి చొరబడి ఆందోళన నిర్వహించారు. నిర్వాహకులతో వాగ్వాదం చేసి క్రిస్మస్ ఫ్లెక్సీలు చింపివేశారు. డెకరేషన్‌లను తొలగించారు. సేవ పేరుతో మతమార్పిడులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఆందోళన చేశారు. కిడ్స్ పాఠశాల నిర్వాహకులు బాలాజీ నాయక్ ఫిర్యాదుతో పలువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువతి అదృశ్యం



స్పందన

హుజూర్‌నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. పట్టణానికి కర్నె స్పందన ఇటీవల పీజీ పూర్తి చేసి ఇంటివద్దనే ఉంటోంది. ఈనెల 24న తల్లిదండ్రులు కూలీపనికి వెళ్లగా ఈ సమయంలో స్పందన ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం తల్లిదండ్రులు వచ్చి చూడగా ఇంట్లో లేకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికారు. అయినా ఆమె సమాచారం లభించకపోవడంతో తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు.

ఆపి ఉన్న కారును ఢీకొన్న బైక్: వ్యక్తి మృతి

చింతపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నిలిపి ఉన్న కారును వెనుక నుంచి బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో సాగర్-హైవేపై గురువారం జరిగింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ మండలం తాటికోల్ గ్రామానికి చెందిన తోటపల్లి రాములు(39) రంగారెడ్డి జిల్లా మంచాల గ్రామంలో ఓ గార్డెన్స్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ జీవితం సాగిస్తున్నాడు. ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవడానికి తాటికోల్‌కి వచ్చి తిరిగి గొల్లపల్లిలో బావకు ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో లింగంపల్లి గ్రామానికి చెందిన మూడావత్ ప్రదీప్ అజాగ్రత్తగా కారును మండలంలోని వింజమూర్ గ్రామశివారులో రోడ్డు పైనే పార్క్ చేసి వెళ్లాడు. బైక్ చింతపల్లి నుంచి గొల్లపల్లికి వస్తూ నిలిపి ఉన్న కారును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో రాములు తలకు బలంగా తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. రాములు బావ వెలిజర్ల ఆంజనేయులు ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా కారు పార్క్ చేసి ప్రదీప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ చిన్నారి...



సాక్షిత(ఫైల్)

రాజాపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాలిన గాయాలతో చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం రేణికుంట గ్రామంలో జరిగింది. ఎస్ఐ మైసయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేణికుంట గ్రామానికి చెందిన ఎర్ర పరమేష్, స్వప్న దంపతులకు ముగ్గురు సంతానం కాగా ఈ నెల 20న ఇంట్లో వంట చేయడానికి గ్యాస్ అయిపోవడంతో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్నారు. అదే క్రమంలో రెండో కుమార్తె సాక్షిత(మూడున్నర సంవత్సరాలు) ఆడుకుంటూ వచ్చి కట్టెల పొయ్యిపై పడింది. దీంతో నిప్పంటుకొని తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. చిన్నారి మృతిపై ఆమె తండ్రి పరమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మైసయ్య తెలిపారు.

మనిమద్దెలో డెంగీతో విద్యార్థి...



పవన్(ఫైల్)

శాలిగౌరారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : డెంగీ వ్యాధితో చికిత్స పొందుతూ 10వ తరగతి విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మనిమద్దె గ్రామంలో గురువారం జరిగింది. ఇందుకు సంబంధించిన గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మనిమిద్దె గ్రామానికి చెందిన జనగం నాగరాజు, సైదమ్మ దంపతుల కుమారుడు పవన్(16) వల్లాల మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. పవన్‌కు గత రోజులుగా జ్వరం రావడంతో నకిరేకల్, నల్లగొండలోని ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు.

అప్పుల బాధ తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య

అడ్డగూడూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం అడ్డగూడూరు మండలకేంద్రానికి చెందిన బీరవెల్లి నర్సయ్య(51) తన కుటుంబ నిర్వహణ కోసం అప్పులు చేశాడు. అప్పుల తీర్చలేక, ఆ బాధ తట్టుకోలేక ఈ నెల 22న ఉదయం ఇంట్లో క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన భార్య సత్యవతి వెంటనే 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి చికిత్స కొసం తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాత ఆచారాలు, సౌకర్యాల దిశగా 'గుట్ట'

- భక్తుల మనోభీష్టమే ప్రధానం
- క్షేత్రంలో భక్తుల సౌకర్యాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- తాత్కాలిక డార్మెంటరీ హాల్‌తో పాటు కొబ్బరికాయలు కొట్టేందుకు స్థలం ఎంపిక
- తిరుపతి స్థాయిలో పాలకవర్గం ఏర్పాటుకు సమాలోచనలు
- కొత్త ప్రభుత్వం రాకతో సౌకర్యాల కల్పనపై ఆశలు
- ప్రధాన గోపురంపై బంగారం తాపడం పనులు షురూ



యాదాద్రి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం అనంతరం క్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగింది. స్వామివారిని దర్శించుకునేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాతో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు. గతంలో తాత్కాలికంగా బాలాలయంలో ప్రతిష్ఠించిన కవచమూర్తులను రోజువారీగా ఆరు వేల నుంచి 10 వేల మంది భక్తులు రాగా, సెలవురోజుల్లో 30వేల వరకు వచ్చేవారు. ఆలయ పునర్నిర్మాణం 2022 మార్చి 28 మహాకుంభసంప్రోక్షణ అనంతరం భక్తులకు గర్భాలయ దర్శనాలు ప్రారంభమయ్యాయి. దీంతో రోజువారీగా 15 వేలకు పైగా, సెలవురోజుల్లో దాదాపు 45వేల మంది వరకు దర్శించుకుంటున్నారు.

పాత ఆచారాల పునరుద్ధరణ

ఆలయ విస్తరణ, పునర్నిర్మాణంలో భాగంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పాత ఆచారాలను అన్నింటిని పక్కనపెట్టింది. అయితే యాదగిరికొండపై పాతఆచారాలను పునరుద్ధరించాలని గతేడాది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించి, చర్యలు తీసుకుంటోంది. గతంలో స్వామివారి చెంత ఒకరాత్రి గుట్టపైనే నిద్రచేసి మొక్కును చెల్లించుకునేవారు. కొండపైనే తలనీలాలు సమర్పించి, పుష్కరిణిలో స్నానాలు చేసేవారు. వీటితో పాటు గర్భాలయ ప్రదక్షణ, కొబ్బరికాయలు కొట్టడం వంటి సౌకర్యాలు ఉండేవి. ఇటీవల స్వామివారి సన్నిధిలో కొబ్బరికాయలు కొట్టు స్థలాన్ని ప్రారంభించారు. అదేవిధంగా కొండపైకి ఆటోలను అనుమతించారు. రాత్రి వేళ భక్తులు నిద్ర చేసేందుకు భక్తుల కోసం క్యూకాంప్లెక్స్‌లో గతంలో శివాలయం(తాత్కాలికంగా) స్థలంలో డార్మెంటరీ హాల్‌ను ఏర్పాటుచేశారు. శాశ్వత ప్రాతిపదికన రూ.60లక్షలతో చలువ పందిళ్లను ఏర్పాటుచేయనున్నారు. స్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి ముందుగా స్థానిక భక్తులకు గర్భాలయం(అంతరాలయ)దర్శనం ఉండేది. స్థానిక భక్తుల డిమాండ్ దృష్ట్యా ప్రతీ శనివారం స్వామి వారి దర్శనానికి అనుమతించింది.

సౌకర్యాలపై కొత్త సర్కారు నజర్

రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో చేపట్టే అభివృద్ధి పనులు ఆలయాల ప్రాశస్త్యం, క్షేత్ర విశిష్టతకు భంగం కలుగకుండా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. యాదాద్రి ఆలయ ప్రాంగణంలో వసతులతో పాటు సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. దాదాపుగా 60కిలోల బంగారంతో స్వామివారి ప్రధాన ఆలయంలోని గర్భగుడి విమానగోపురానికి స్వర్ణతాపడం పనులు ప్రారంభించారు. పూలు, తులసి వంటి పవిత్ర పత్రాలను కొనుగోలు చేయకుండా దేవాలయ భూముల్లోనే పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. దేశంలోనే రెండో అతి పెద్ద పొడవైన లింక్ బ్రిడ్జి నిర్మాణం పనులు నిలిచిపోగా, దానిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం సానుకూలం స్పందించడంతో భక్తులకు తిప్పలు తప్పనున్నాయి. కొండకింద భక్తుల కోసం అత్యాధునికంగా అన్నదాన సత్రాన్ని నిర్మాణానికి చర్యలు చేపట్టింది. రాయగిరి చెరువు వద్ద ఏర్పాటుచేసిన శిల్పారామం పనులు పూర్తయితే భక్తులకు కొంత ఆహ్లాదం పంచనుంది. కొండపైన 200 గదులు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. స్వామివారి సన్నిధికి పెద్దఎత్తున భక్తులు తరలివస్తుండటంతో లడ్డూ, పులిహోర ప్రసాదాల కోసం ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొండపైన ఉన్న శివాలయం పక్కన ప్రత్యేకంగా ప్రసాదాల టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు.

గుట్టలో 'గిరి ప్రదక్షిణ'పై విస్తృత ప్రచారం

స్వామికి స్థానిక భక్తులు గిరిప్రదక్షిణ చేసుకుని, స్వామి వారిని దర్శించుకోవడం ఆనవాయితీ. దీనిని ఆలయ పునర్నిర్మాణ సమయంలో ఇబ్బంది ఉండేది. ప్రస్తుతం గిరిప్రదక్షణను పునరుద్ధరించారు. అయితే యాదగిరిగుట్టలో ఇప్పటి వరకు స్థానిక భక్తులే గిరి ప్రదక్షిణ చేస్తున్నారు. తమిళనాడులోని అరుణాచలం, ఆంధ్రప్రదేశ్‌లోని సింహచలం తరహాలో స్థానిక భక్తులతో పాటు ఆలయానికి విచ్చేసే వారంతా కూడా గిరిప్రదక్షణ చేసేందుకు ఆలయ అధికారులు జూన్15 నుంచి ప్రారంభించారు. స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం రోజున భక్తులతో గుట్ట చుట్టూ 2.5 కిలోమీటర్ల గిరిప్రదిక్షణ చేపడుతున్నారు.

'గుట్ట'కు టీటీడీ తరహాలో మండలి

యాదగిరిగుట్ట దేవస్థానంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మాదిరిగా యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డును ఏర్పాటుచేయాలని ఆగస్టు 30న ఆదేశాలు జారీ చేసింది. గుట్టకు పెద్దసంఖ్యలో భక్తులు వస్తున్నారు. ఆదేస్థాయిలో వారికి సౌకర్యాలు ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఉన్న పరిపాలనా విధానంతో ఆలయ నిర్వహణ సాధ్యం కాకపోవచ్చని..ప్రత్యేక మండలిని ఏర్పాటుచేయాలని యోచిస్తోంది. ఆలయానికి ఉన్నతస్థాయి అధికారిని ఎగ్జిక్యూటివ్(ఈవో) అధికారిగా నియమించనుంది. పాలకమండలిని నియమించిన పక్షంలో చైర్మన్‌తో పాటు సభ్యులు, ఉన్నతాధికారుల పర్యకవేక్షణ కొనసాగుతుంది. ప్రస్తుతం ఆలయ నిర్వహణ బాధ్యతలు దేవాదాయ శాఖతో పాటు వైటీడీఏ పర్యవేక్షిస్తుంది. వైటీడీఏ చైర్మన్‌గా ముఖ్యమంత్రి కొనసాగుతుండగా, వైస్‌చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కిషన్‌రావు కొనసాగుతున్నారు. గుట్టపై ఏసీపీ స్థాయి అధికారిని నియమించిన ప్రభుత్వం, భద్రతపై మరింత పటిష్ఠంగా చేపట్టనుంది.

బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్

యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవం రోజున సీఎం ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి గీతారెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు హాజరయ్యారు. అయితే స్వామి వారి దర్శనం అనంతరం ఆశీర్వచనం సందర్భంగా ప్రోటోకాల్ వివాదం నెలకొంది. అదేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి తన జన్మదినం రోజైన నవంబరు 8న లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రెసిడెన్సియల్ సూట్‌లో దేవాదాయ, వైటీడీఏ, జిల్లా అధికారులతో ఆలయ అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఆలయ అభివృద్ధి పనుల పురోగతితో పాటు మిగిలిపోయిన పనులు, నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఇదిలా ఉండగా పలు సందర్భాల్లో రాజకీయ వివాదాలకు కేంద్రంగా క్షేత్రం నిలిచింది.

భక్తి పారవశ్యం

● గిరిప్రదక్షిణ ప్రారంభించిన విప్ అయిలయ్య, ఎంపీ చామల



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ప్రభుత్వ విప్ అయిలయ్య, ఎంపీ చామల తదితరులు

భువనగిరి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వాతి వేడుకలు, గిరిప్రదక్షిణ పర్వాలు గురు వారం వైభవంగా కొనసాగాయి. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున 5:45 గంటలకు అర్చకులు వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులచే మంగళవాయిద్యాల నడుమ అర్చకులు హారతి సమర్పించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. గిరిప్రదక్షిణ మహోత్సవంలో తెల్లవారు జామున స్వామి వారిని స్తుతిస్తూ ప్రత్యేక వేశాధారణలో కళాకారుల కోలాటాలు, నృత్యాలు, భజనలు, కీర్తనలు పాడారు. సుమారు 10వేల మంది భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. వైకుంఠ ద్వారం నుంచి కొండకు పశ్చిమ, ఉత్తర దిక్కుల్లో నూతనంగా నిర్మించిన మండపాల్లో భక్త ప్రహ్లాద, మునీశ్వరుడు యాదరుషీ విగ్రహాలను ప్రతిష్ఠించి ఎంపీతో కలిసి ప్రభుత్వ విప్ ప్రారంభించారు.

అష్టోత్తర శతఘటాభిషేక పూజలు

ఆలయంలో వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహిం చారు. సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపి నిత్యారాధనలు జరిపిన అర్చకులు ఆస్థాన పరంగా ఆరాధనల అనంతరం ఉత్సవ మూర్తులకు హారతి నివేదించారు. ముఖమండపంలో 108కలశాలు వాటిపై కొబ్బరికాయలు పేర్చి అందులో పంచామృతాలు నింపి పంచసూక్త పఠనాలతో హోమం చేపట్టి ఉత్సవమూర్తులను, ఆలంకార మూర్తులను అభిషేకించారు. తులసీ దళాలతో సహ నామార్చనలు చేపట్టారు. ఆలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్ప మాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. మంగళ వాయిద్యాల నడుమ వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు

ఆలయంలో చేపట్టిన ధనుర్మాసోత్సవాలు 11వ రోజుకు చేరాయి. గురు వారం జరిపిన వ్రతంలో ఉదయాన్నే బృందావనంలోని గోపికను వ్రతానికి సిద్ధం చేసిన పర్వం అలరించింది. కొండపైన వేడుకల సందర్భంగా 'శ్రీ వెంకట అన్నమాచార్య సేవాట్రస్ట్ సంస్కృతి' కూచిపూడి నృత్యం, తాళ్లపాక అన్నమయ్యచారి 12వ తరం వారసుడు స్వామీజీ దివ్య మంగళ శాసనాలతో కార్యక్రమాలు రూపకల్పన చేశారు. భక్తి కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చిరుతలతో భజన చేసి ఆకట్టుకున్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్ర వైడూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలి పూజలతో కల్యాణతంతు కొనసాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతి లో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.40,30,791ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కొండపైన తిరువీధులు, ఉత్తర ప్రాకార మండపం, ప్రసాద కౌంటర్లు, శివాలయం వద్దకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వీఐపీ పార్కింగ్ నుంచి తూర్పు రాజ గోపురం భక్తులను తరలించేందుకు ఎలక్ట్రికల్ వాహనాలు విని యోగించారు. సుమారు 34వేల మంది భక్తులు ఇష్టదైవాలను దర్శించుకున్నట్లు అధికారులు తెలి పారు. ప్రత్యేక దర్శనానికి అర్ధగంట ధర్మదర్శనానికి గంటన్నర సమయం పట్టిందని భక్తులు తెలిపారు.



యాదరుషీ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల, ఎంపీ చామల తదితరులు

ఏడాదంతా రాజకీయమే



నల్లగొండలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవాల బహిరంగసభలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ (ఫైల్)

మననం 2024

నల్లగొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ ఏడాదంతా రాజకీయ సందడి నెలకొంది. ఏడాది కాలమే ఉన్నా మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాల ద్వారా బీఆర్ఎస్ చైర్మన్లను గద్దెదించి ఉమ్మడి జిల్లాలో మునిసిపాలిటీలను కాంగ్రెస్ హస్తగతం చేసు కుంది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై విమర్శలకు సమాధానంగా సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి జిల్లాలో మూసీ నది వెంట పాదయాత్ర నిర్వహించారు. ఏడాది చివరన సీఎం రేవంత్‌రెడ్డి నల్లగొండ జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న విజయం

శాసనమండలి వరంగల్-నల్లగొండ-ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి జూన్‌లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థి తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్‌కుమార్) బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిపై విజయం సాధించారు. ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో మల్లన్న విజయం సాధించారు. ధీటైన ప్రచారం, పోటాపోటీ వ్యూహాలతో సాగిన ఉపఎన్నిక అందరిదృష్టినీ ఆకర్షించింది

ద్వితీయశ్రేణి నాయకులకు మార్కెట్ పదవులు

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయమార్కెట్ కమిటీ పాలకవర్గాల నియామ కాల్లోనూ మంత్రులు, ఎమ్మెల్యేలు ఈసారి జాప్యం చేయకుండా నియామకాలు చేస్తూ వచ్చారు. దీంతో గడిచిన ఏడాదిలో ఉమ్మడి జిల్లాలో 21కి 14మార్కెట్ కమిటీలకు చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ల నియామకాలు జరిగాయి. వీటితో పాటుగా జిల్లాలోని పలు దేవాలయ కమిటీలకు ధర్మకర్తల మండలి సభ్యులను నియమించారు.

డీసీసీబీ చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నిక

ఉమ్మడి జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేల తర్వాత అంతస్థాయి కలిగిన డీసీసీబీ చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ హస్తగతం చేసుకొంది. డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న బీఆర్ఎస్ నేత గొంగడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసం తీర్మానం ప్రవేశ పెట్టిన కాంగ్రెస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మొత్తం 19 మందిలో 15మంది డైరెక్టర్లను తనవైపు తిప్పుకొని గొంగిడిని గద్దెదింపారు. అనంతరం జరిగిన ఎన్నికలో కుంభం శ్రీనివాస్‌రెడ్డి డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. డీసీఎంఎస్ పీఠాన్ని సైతం కాంగ్రెస్ గెలుచు కుంది. డీసీఎంఎస్ చైర్మన్‌గా ఉన్న వట్టె జానయ్యయాదవ్‌పై అసెంబ్లీ ఎన్నికల ముందు వేటుపడడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న దుర్గెంపూడి నారాయణరెడ్డి చైర్మన్‌గా నియమితుల య్యారు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన చైర్మన్ ఎన్నికలో కేతేపల్లి పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకటరెడ్డి డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

మునిసిపాలిటీలు హస్తగతం

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే మునిసిపాలిటీలలో బీఆర్ఎస్‌ను గద్దెదించే కార్యాచరణ కొనసాగింది. ఉమ్మడి జిల్లాలోని 19 మున్సిపాల్టీలకుగాను ఆలేరు, సూర్యాపేట మినహా అన్ని మున్సిపాల్టీలను అవిశ్వాసాలు, చైర్మన్లను పార్టీలో చేర్చుకోవడం ద్వారా కాంగ్రెస్ కైవసం చేసుకొంది. సూర్యాపేటలో అనూహ్యంగా అవిశ్వాసం తీర్మానం వీగిపోవడంతో బీఆర్ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్ అన్నపూర్ణ పదవిలో కొనసాగుతున్నారు.

గుత్తా తనయుడు అమిత్‌కు కార్పొరేషన్ పదవి

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఉమ్మడి జిల్లాలోని రెండు సీట్లలో ఎక్కడ అవకాశం కల్పించినా పోటీచేస్తానని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి బీఆర్ఎస్ అధిష్ఠానాన్ని కోరారు. ఆయనకు రెండు చోట్లా పార్టీ అవకాశం కల్పించకపోవడంతో ఎన్నికలకు ముందే అమిత్‌రెడ్డి, గుత్తా సోదరుడు మదర్‌డెయిరీ మాజీ చైర్మన్ జితేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌ని వీడి సీఎం సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం అనూహ్యంగా అమిత్‌రెడ్డికి రాష్ట్ర డెయిరీ డెవలప్ మెంట్ ఫెడరేషన్ చైర్మన్ పదవి దక్కింది. సుఖేందర్‌రెడ్డి సైతం ఉమ్మడి రాష్ట్రంలో ఈ పదవిని నిర్వహించారు.



ఉప ఎన్నిక ప్రచారంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న (ఫైల్)

పదవులు దక్కక పలువురు నేతల అసంతృప్తి

ఒకవైపు పదవుల పందేరంతో కీలకనాయకులకు అవకాశాలు దక్కినా, తమకు ప్రాధాన్యం దక్కలేదని కొందరు అసంతృప్తితో రగలి పోతున్న పరిస్థితి కాంగ్రెస్‌లో నెలకొంది. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో టిక్కెట్లు ఆశించి భంగపడ్డవారు, తమ నేతల గెలుపు కోసం శ్రమించిన నాయకులు తమకు పదవులిప్పించడంలో నేతల కృషి కొలిక్కి రాకపోవడంపై లోలోపల మథనపడి నేతలపై ఒత్తిడి తెస్తున్న పరిస్థితి కొనసాగుతోంది.

జిల్లాలో పర్యటించిన మాజీ సీఎం కేసీఆర్



సూర్యాపేట జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి (ఫైల్)

కృష్ణాజలాల్లో రాష్ట్రానికి న్యాయం చేయాలని, కృష్ణాజలాల హక్కుల సాధనకు ఫిబ్రవరిలో నల్లగొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో నల్లగొండ బహిరంగ సభలో మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హాజరై ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆయన జిల్లాలో కరువు యాత్ర నిర్వహించారు. సూర్యాపేట జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి రైతులతో ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలోనూ పలు రోడ్‌షోలలో మాజీ సీఎం ప్రసంగించారు.

జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు మద్దతుగా సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి యాదాద్రి జిల్లాలో పర్యటించి మూసీ వెంట పాదయాత్ర నిర్వహించారు. అక్టోబరులో ఆయన మూసీ యాత్ర కొనసాగించారు. నల్లగొండ జిల్లాను పట్టిపీడిస్తున్న మూసీ కాలుష్యాన్ని వదలగొడతామని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైన సందర్భంగా డిసెంబరు 7వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలోని ప్రతిష్ఠాత్మకమైన బ్రాహ్మణవెల్లంల రిజర్వాయర్‌ని ప్రారంభించారు. అదే రోజున యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌ను జాతికి అంకితం చేశారు. నల్లగొండలో మెడికల్‌కాలేజీని ప్రారంభించి రాష్ట్ర ప్రగతిపై మాట్లాడారు.

విధేయతకు పట్టం..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో ఆ పార్టీకి చెందిన ఉమ్మడి జిల్లాలోని కీలకనాయకులు, సీఎం రేవంత్‌రెడ్డి విధేయులకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు దక్కాయి. రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్‌గా పటేల్ రమేష్‌రెడ్డి(సూర్యాపేట), రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్‌గా బండ్రు శోభారాణి(ఆలేరు), దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా ముత్తినేని వీరయ్య(హుజూర్‌నగర్), ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నాగరిగారి ప్రీతమ్ (మోత్కూరు) నియమితులయ్యారు. అనంతరం కొద్దికాలానికి గుత్తా అమిత్‌రెడ్డి రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. వీరితో పాటు రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలిగా సూర్యాపేటకు చెందిన పాల్వాయి రజనీకుమారి, సభ్యుడిగా సంస్థాన్‌నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెంకి చెందిన డాక్టర్ నర్రి యాదయ్య, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యుడిగా తిరుమలగిరికి చెందిన హైకోర్టు న్యాయవాది, కాంగ్రెస్ అధికార ప్రతినిధి సంకేపల్లి సుధీర్‌రెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ నియమితులయ్యారు. సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా వంగవేటి రామారావు నియమితులయ్యారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా



ఈ ఏడాది మే నెలలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ హవా కొనసాగింది. జిల్లాలోని రెండు లోక్‌సభసీట్లలో నల్లగొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి సమీప బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిపై భారీ మెజార్టీతో విజయం సాధించారు. దక్షిణ భారతదేశంలోనే ఇది రికార్డు మెజార్టీగా నమోదైంది. భువనగిరి స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూరనర్సయ్యగౌడ్‌పై విజయం సాధించారు. అనూహ్యంగా ఈ రెండు స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు కంచర్ల కృష్ణారెడ్డి, క్యామమల్లేశ్‌యాదవ్ మూడోస్థానంలో నిలిచారు. ఎలాగైనా జిల్లాలో ఒక్కసీటైనా గెలవాలనే తపనతో బీజేపీ ఈ ఎన్నికల్లో గట్టి అభ్యర్థులను బరిలో దింపింది. బీఆర్ఎస్ ఓటర్లను ఆకర్షించే లక్ష్యంతో ఆ పార్టీకి చెందిన పూర్వపు నేతలకే రెండు సీట్లలోనూ టిక్కెట్లిచ్చినా ద్వితీయ స్థానంలోనే నిలిచింది తప్ప విజయానికి దగ్గర కాలేకపోయింది.

విదేశీ అతిథులు..

యాదాద్రిభువనగిరి జిల్లాకు గురువారం అనుకోని అతిథులు వచ్చాయి. మూసీ పరివాహక ప్రాంతమైన భూదాన్‌పోచంపల్లి మండలంలోని ఆయకట్టులో సైబీరియన్ కొంగలు సందడి చేశాయి. పచ్చని పొలాలు, నిండుకుండలా జలాశయాలతో చెరువులు, గలగలపారే నీటి కాల్వలతో కలియ తిరిగాయి. వలస పక్షులకు అనుకూలంగా ఉండడంతో పెద్దఎత్తున వచ్చాయి. మండలంలోని రాంలింగంపల్లి చెరువు, పరిసర ప్రాంతాల్లో వంకు తిరిగిన పొడవాటి పసుపు రంగులో ముక్కు, పొడవైన కాళ్లు కలిగి బూడిద రంగు రెక్కలతో అవి చూపరులను కనువిందు చేస్తున్నాయి. ఈ పక్షులు చెరువులోని చిన్నచిన్న చేపలను వేటాడి ఆకలి తీర్చుకున్నాయి. పగలంతా చెరువులు, పంటపొలాల్లో విహరించి, రాత్రి సమయాల్లో సమీపంలో ఉన్న చెట్లపై నివాసముంటున్నాయి. ప్రతి ఏటా భూదాన్‌పోచంపల్లి మండలానికి సెబీరియన్ వలస వస్తూ సందడి చేస్తున్నాయి.

● (భూదాన్‌పోచంపల్లి, ఆంధ్రజ్యోతి)



చెరువులో..





భూదాన్‌పోచంపల్లి మండలం మూసీ పరివాహక చెరువు తీరంలో సైబీరియన్ పక్షులు

సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా రమణ



సూర్యాపేట లీగల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణానికి చెందిన న్యాయవాది బి. వెంకటరమణను సూర్యాపేట సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆమె జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలిగా పని చేస్తున్నారు. ఆమెను న్యాయవాదులు అభినందించారు.

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మఠంపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో గురువారం పోలీసులు పట్టుకున్నారు. హుజూర్‌నగర్ సీఐ జి. చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం... గుండ్లపల్లి, రఘునాథపాలెం గ్రామాల నుంచి బలకట్టు మీదుగా కొందరు ద్విచక్ర వాహనంపై రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారంతో ఆ రెండు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించి ఇద్దరి నుంచి ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయ అందం ప్రతిబింబం



రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో నిలిచిన నీటిలో ఆలయ ప్రతిమ అబ్బురపరుస్తోంది. అద్భుత ఆలయ శిల్పకళా సంపద నీటిలో ప్రతిబింబంలా కనువిందు చేసింది. ముసురు కురుస్తుండడంతో కొండపైన చల్లటి గాలుల్లో భక్తులు క్యూలైన్లల్లో ఉండి మొక్కులు తీర్చుకున్నారు.

ఆంధ్రజ్యోతి - ఫొటోగ్రాఫర్ యాదాద్రి



జనవరి 4 నుంచి భజన మండలి స్వర్ణోత్సవాలు



పాండురంగస్వామి భజన మండలి స్వర్ణోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న భజనమండలి సభ్యులు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని పాండు రంగస్వామి భజనమండలి స్వర్ణోత్సవాలు జనవరి 4,5,6వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు చక్రాల నర్సింహ, ప్రధాన కార్యదర్శి పుప్పాల నాగేశ్వర్ తెలిపారు. స్థానిక మార్కండేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో స్వర్ణోత్సవాల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. జన వరి 4, 5వ తేదీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి భజన సంకీర్తన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సవాలకు అవధానశారద డాక్టర్ గరికపాటి నరసింహ రావు హాజరవుతారని తెలిపారు. జనవరి 6వ తేదీన రుక్మా బాయి పాండు రంగస్వామి కల్యాణోత్సవం నిర్వహించను న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భజనమండలి అధ్యక్షుడు చక్రాల నర్సింహ, ప్రధాన కార్యదర్శి పుప్పాల నాగేశ్వర్, సీత సత్యనారాయణ, భారత వెంకటేశం, దోర్నాల శ్రీనాథ్, కొంగరి పండరీనాథ్, అశోక్, చిట్టిమల్ల లక్ష్మీనారాయణ, పెంటయ్య పాల్గొన్నారు.

అన్నీ ఉన్నా.. నిరాశే

● ఉసూరుమంటున్న క్రీడాకారులు ● ఔత్సాహికులకు కరువైన ప్రోత్సాహం
● ఉద్యోగులు, వ్యాపారులకు ఆటవిడుపుగా మారిన ఇండోర్ స్టేడియం



ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ కోర్టు

నల్లగొండకల్చరల్, డిసెంబరు 26: గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని విద్యార్థులు, యువకులను క్రీడాకారులుగా తయారు చేయాలనే ఉద్దేశంతో ఇండోర్ స్టేడియాన్ని నిర్మించారు. పలు క్రీడాంశాల్లో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలి. కానీ నల్లగొండ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో వసతులు ఉన్నా శిక్షణ, పోటీలు కరువైనట్లు పలువురు క్రీడారులు ఆరోపిస్తున్నారు. 2007 సంవత్సరంలో పట్టణంలోని ఎన్జీటీ మార్కెట్‌కు ఎదురుగా ఉన్న 1.20 ఎకరాల స్థలంలో ఇండోర్ స్టేడియంతో పాటు జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ ఫూల్‌ను నిర్మించారు. ఇదే ప్రాంగణంలో టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి కోర్టులను ఏర్పాటు చేశారు. వేసవిలో మాత్రమే స్విమ్మింగ్‌ఫూల్ పని చేస్తుండగా, టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలు మాత్రం సాగుతున్నాయి. టెబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలకు చేరో మూడు కోర్టులను ఏర్పాటు చేశారు. టెబుల్ టెన్నిస్ క్రీడ మొదట్లో ముమ్మరంగా కొనసాగింది. ప్రస్తుతం అడపాదడపా శిక్షణ కొనసాగుతుందని క్రీడాకారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా చెస్ కోసం ఒక గదిని ఏర్పాటు చేయగా పోటీలు నిర్వహించిన సందర్భాలు చాలా తక్కువ. గతంలో ఇదే ప్రాంగణంలో జిమ్ ఉండేది. స్టేడియం ఆధునికీకరణలో భాగంగా దానిని తొలగించారు. నూతన పరికరాలతో వ్యాయామశాల ఏర్పాటు చేస్తారనే ప్రచారం జరిగినా దానిని ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఇక్కడ వ్యాయామశాల సౌకర్యం లేకపోవడంలో యువకులు ఇబ్బంది పడుతున్నారు.

పోటీలు ఏర్పాటు శూన్యం

షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలకు రెగ్యులర్ కోచ్ ఉన్నారు. వారి సారథ్యంలోనే శిక్షణ సాగుతుంది. ఉద్యోగులు, వ్యాపారులతో పాటు విద్యార్థులు, యువకులు శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వెళ్తున్నారు. ఇండోర్ స్టేడియంలో టోర్నమెంట్లు పెట్టకపోవడంతో చాలామంది క్రీడాకారులు క్రీడను నేర్చుకొని మధ్యలోనే మానేస్తున్నారు. గతంలో టేబుల్ టెన్నిస్ రాష్ట్ర స్థాయి పోటీలు కూడా నిర్వహించారు. నూతనంగా క్రీడాకారులను తయారు చేయాలంటే ఫ్రీ కోచింగ్ క్యాంపులు నిర్వహించాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు.

కోట్లాది రూపాయలతో ఆధునికీకరణ

ఇండోర్ స్టేడియంలో ఉన్న స్విమ్మింగ్‌ఫూల్ రూ.1.90 కోట్లతో పునరుద్ధరించారు. స్విమ్మింగ్‌ఫూల్ సౌకర్యాన్ని పట్టణ ప్రజలు ఉపయోగించుకునేందుకు వారి నుంచి రుసుము వసూలు చేస్తారు. అంతేకాకుండా టెబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులను నూతనంగా రూ.1.50 కోట్లతో పునరుద్ధరించారు. ఈ రెండు క్రీడలకు ప్రత్యేకంగా నాలుగు కోర్టులను ఏర్పాటు చేశారు. షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులను సిథటింక్‌తో ఏర్పాటు చేశారు. అదే ప్రాంగణంలో తైక్వాండో, కరాటే క్రీడలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మాత్రం వేసవిలో మాత్రమే నెల రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం 5 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు రెండు విడతలుగా నాలుగు కోర్టుల్లో ఆట కొనసాగుతుంది. కానీ శిక్షణ పొందేవారు కాకుండా సుమారు 200 మంది పట్టణ ప్రముఖులు, వ్యాపారస్థులు ఆటలు ఆడుతున్నారు. రెండేళ్ల క్రితం ఇండోర్ స్టేడియంలో నూతనంగా క్రీడా భవనాలను పునరుద్ధరణ చేయడంతో పెద్ద స్టేడియాలకు తగినట్లుగా తయారు చేశారు. క్రీడలకు రెగ్యులర్ కోచ్‌లను నియమించి ఔత్సహిక క్రీడాకారులను ప్రోత్సహిస్తే ఇండోర్ స్టేడియం క్రీడాకారులతో నిత్యం కళకళలాడుతుందని కొందరు క్రీడాకారులు పేర్కొంటున్నారు.

సౌకర్యాలు లేక ఇబ్బందులు

ఇండోర్ స్టేడియంలో మౌలిక సదుపాయాలు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. కరెంట్ లేని సమయంలో ఆటలకు ఆటకంగా కలుగుతుంది. అంతేకాక తాగునీరు, ప్రతీ క్రీడా ప్రాంగణంలో క్రీడాకారుల కోసం బాత్‌రూమ్, టాయిలెట్స్, స్నానాల గదుల వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. స్టేడియంలో జనరేటర్ ఏర్పాటు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, వ్యాయామశాలను తిరిగి ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లగా ఆయన కూడా సానుకూలంగా స్పందించారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ఇండోర్ స్టేడియంలో అన్ని క్రీడలు ఏర్పాటు చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు. పట్టణ, గ్రామీణ క్రీడాకారులను గుర్తించి ప్రత్యేకంగా తర్ఫీదు ఇవ్వాలి.


ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు

జనరేటర్ సౌకర్యం కల్పించాలి



ఇండోర్ స్టేడియంలో క్రీడలకు అంతరాయం కలగకుండా జనరేటర్ సౌకర్యం కల్పించాలి. ఇటీవల కాలంలో ఉదయం, సాయంత్రం ఎక్కువ సార్లు కరెంట్ పోవడం వల్ల ఆటలకు అంతరాయం కలుగుతుంది. క్రీడాకారులకు తాగునీరు వసతి కల్పించాలి. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు నిర్వహించాలి. యువకులను ప్రోత్సహించేందుకు క్రీడా వేదికను ఏర్పాటు చేయాలి.

● పంతులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి, షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్

వ్యాయామశాలను ఏర్పాటు చేయాలి



యువకులు ఫిట్‌నెస్‌ను పెంచుకునేందుకు ఇండోర్ స్టేడియంలో వ్యాయామ శాలను ఏర్పాటు చేయాలి. గతంలో ఇదే ప్రాంగణంలో జిమ్ సౌకర్యం ఉండేది. స్టేడియం పునరుద్ధణ సమయంలో దానిని తొలగించి మేఖల అభినవ్ స్టేడియానికి తరలించారు. దీంతో యువకులు చాలా ఇబ్బంది పడుతున్నారు. క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు ఇంకా కల్పించాలి. అన్ని క్రీడలకు రెగ్యులర్ కోచ్‌లను నియమించాలి.

● యాట గోవర్ధన్‌రెడ్డి, అధ్యక్షుడు, షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్

బూత్ కమిటీ ఎన్నికలే పార్టీకి పునాది

నల్లగొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బూత్ కమిటీ ఎన్నికలే పార్టీకి పునాది అని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమిరెడ్డి భిక్షంరెడ్డి అన్నారు. పట్టణంలోని 17వ వార్డు లో నిర్వహించిన 161 బూత్ కమిటీ ఎన్నికల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని సూచించారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా తీగల శ్రవణ్‌కుమార్, కార్యదర్శిగా యాదగిరి ఎన్నికయ్యారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్యాంకు సేవలకు అంతరాయం

నాంపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక సమస్యల కారణంగా ఈ నెల 28 నుంచి జనవరి 1వ తేదీ వరకు ఏపీజీవీబీ బ్యాంకు సేవలు అందుబాటులో ఉండవని ఆ బ్యాంకు మేనేజర్ మహాలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఉన్న ఏపీజీవీబీ జనవరి 1 నుంచి టీజీబీగా పేరు మారుతున్నందున కొన్ని సాంకేతిక సమస్యల వల్ల నెట్ బ్యాంకింగ్, యూపీఐ, ఏటీఎం తదితర సేవలు అందుబాటులో ఉండనందున ఖాతాదారులు ముందస్తు ప్రణాళిక చేసుకొని బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.


ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది బాలకృష్ణ, అనుదీప్, అనిల్, బ్యాంకు మిత్రలు కాంశెట్టి సైదమ్మ, నేరళ్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శాపల్లిలో గరుడస్తంభ ప్రతిష్ఠాపన


గరుడ స్తంభాన్ని ప్రతిష్ఠించి పూజల చేసిన యాజ్ఞికులు

నార్కట్‌పల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలం శాపల్లిలోని కమలాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో గురువారం గరుడస్తంభ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. కళాన్యాస హోమాలు, గరుడయంత్ర స్థాపన అనంతరం గరుడస్తంభాన్ని సుముహూర్తంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గరుడ స్తంభానికి మహిళలు జలాభిషేకం చేసి హారతులు పట్టారు. అనంతరం దృష్టికుంభం మహానివేదన, భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. సంప్రదాయం, ఆచారంతో కొందరు తమ ఆడపడుచులకు వడి బియ్యం పోశారు. ఆలయ అనువంశిక అర్చకుడు కారంపూడి నర్సింహాచార్యులు, రాకేశాచార్యుల యాజ్ఞికంలో జరిగిన ఈ ప్రతిష్ఠాపన ఉత్సవంలో గరుడ స్తంభ దాతలు మారేడు వెంకట సురేష్‌కల్యాణలక్ష్మి దంపతులు, మాజీ సర్పంచులు సిద్దగోని స్వామిగౌడ్, కర్నాటి ఉపేందర్, గ్రామస్థులు కర్నాటి నర్సయ్య, శిలిగిరెడ్డి వెంకట్‌రెడ్డి, వెంకన్న, స్వామి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి


హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేస్తున్న డీవైఎస్‌వోలు

నల్లగొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ బాలబాలికల జట్ల క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని నల్లగొండ డీఎస్‌వైవో కుంభం నర్సిరెడ్డి, యాదాద్రి భువనగిరి డీఎస్‌వైవో ధనుంజయ అన్నారు. రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ బాలబాలికల జట్ల క్రీడాకారులకు వారు అభినందించారు. అనంతరం హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాలయల పుల్లయ్య సహకారంతో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. పోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కవిత, చైతన్యకుమార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మండల పూజ

కట్టంగూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ సాయి మణికంఠ దేవాలయంలో అయ్యప్ప స్వామి 15వ మండల పూజ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి హోమం నిర్వహించారు. అనంతరం శబరిమల ఆయలంలో మాదిరిగా పంబారట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలధారులు, వందలాది మంది భక్తులు నామస్మరణల మధ్య అయ్యప్పస్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి కొటారు సత్యనారాయణశర్మ, ఆలయ గురుస్వామి, పూల గురుస్వామి, గాదగోని వెంకన్న, గురుస్వాముల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి అయ్యప్ప స్వామి మహాపడి పూజను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ మాజీ ఎంపీపీ జెల్లా ముత్తిలింగం, ఆలయ అధ్యక్షుడు పోగుల నరసింహ, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, శివప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, అయ్యప్ప గురుస్వాములు, లక్ష్మీనారాయణ, నరసింహ, మండల వెంకన్న పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా

(5వ పేజీ తరువాయి)

పనులు వేగంగా పూర్తిచేయాలని కోరుతున్నాం.

ఆం: జిల్లాలో ఇతర సమస్యలపై మీ ఉద్యమ కార్యాచరణ?

సత్యం: జిల్లాలో స్థానిక నిరుద్యోగులకు, యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలు రావాల్సి ఉంది. దురదృష్టవశాత్తు మనం ఆశించనిరీతిలో కాలుష్యకారక ఫార్మా పరిశ్రమలు ఉమ్మడి జిల్లాకు ఎక్కువగా వస్తున్నాయి. ఇప్పటికే చౌటుప్పల్ మండలం పూర్తిగా కాలుష్యభరితమైంది. మునుగోడు నియోజకవర్గంలో ఇవి విస్తరిస్తున్నాయి. వందలాది పరిశ్రమలు అనుమతుల కోసం వేచిచూస్తున్నాయి. మేం వీటికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నాం. భవిష్యత్ తరాల క్షేమం కోసం ఈ పరిశ్రమలపై జరిగే పోరాటంలో స్థానిక ప్రజానీకం భాగస్వాములవ్వాలని కోరుతున్నాం.

ఆం: ఎలాంటి పరిశ్రమలు రావాలని ఆశిస్తున్నారు?

సత్యం: జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా, ఇక్కడి వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసేందుకు అవసరమైన పరిశ్రమలు ఏర్పాటు చేస్తే కాలుష్యం బెడద ఉండదు. అంతేగాక స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కుతాయి. ఐటీ హబ్‌లో కంపెనీలు ఏర్పాటు చేయడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం సూచిస్తున్నట్లు ద్వితీయశ్రేణి పట్టణాల్లో ఐటీ, గ్రీన్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. అదేవిధంగా ఉమ్మడి జిల్లా హైదరాబాద్‌కు సమీపంలో ఉండడంతో కూరగాయల పెంపకంతో పాటు, ప్రాసెసింగ్‌కు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఇటీవల జిల్లాలో ఆయిల్‌పామ్ తోటల పెంపకం ప్రారంభమైంది. దీనికి అనుగుణంగా ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

పేదలు, అణగారిన వర్గాల పక్షాన సీపీఐ పోరాటం


నల్లగొండలో జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా కార్యదర్శి సత్యం

సీపీఐ వందేళ్ల చరిత్ర అంతా పేదలు, అణగారిన వర్గాల పక్షాన పోరాటాలేననీ ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలోని అన్ని మండలాల్లో గురువారం సీపీఐ శతాబ్ది దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించి మాట్లాడారు. ఓట్లు, సీట్ల కోసం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది సీపీఐ మాత్రమేనన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, వేలాది ఎకరాల భూమి పేదలకు భూమి పంచడంలో సీపీఐ కీలకపాత్ర పోషించిందని అన్నారు. వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుల స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. శతాబ్ది దినోత్సవం సందర్భంగా నల్లగొండలో ఈ నెల 30వ తేదీన నిర్వహించే సీపీఐ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

నల్లగొండరూరల్, మునుగోడు: అసమాన త్యాగాలతో కమ్యూనిస్టు పార్టీ నిర్మితమైనదని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. గురువారం స్థానిక జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎర్రజెండాను ఎగురవేశారు. సామ్రాజ్యవాదం, భూస్వామ్య పెట్టుబడుదారీ విధానాలకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన చరిత్ర కమ్యూనిస్టులని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.శ్రావణ్ కుమార్, నాయకులు వీరస్వామి, నరసింహ, రమేష్, లెనిన్, ముత్యాలు రమ, సుజాత పాల్గొన్నారు. మునుగోడులో నిర్వహించిన సమావేశంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు గురిజ రామచంద్రం, బొల్గూరి నర్సింహ, వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చాపల శ్రీను, నాయకులు సురిగి చలపతి, లాలు, యాదయ్య, పాండు, వెంకన్న పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండల కేంద్రంలో సీపీఐ పతాకాన్ని పార్టీ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్ ఎగురవేశారు. కార్యక్రమంలో వెంపటి శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్, తొడుసు సైదులు, మట్టిపల్లి మల్లయ్య, దుబ్బ నర్సింహ, శ్రీపతి స్వామి, సరగండ్ల గణేష్ పాల్గొన్నారు.

నాంపల్లి: మండల కేంద్రంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్. అంజాచారి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సుందనబోయిన రమేష్, సహాయ కార్యదర్శులు ఊరుపక్క వెంకటయ్య, నేతాళ్ల రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళికృష్ణ, వెంకటయ్య, సత్తయ్య, గిరిస్వామి, ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

గట్టుప్పల్: గట్టుప్పల్ మండలంలో మండల కార్యదర్శి బీమనపల్లి రమేష్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం చౌరస్తాలో కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి రాపోలు సత్తయ్య, నాయకులు ధనుంజయ్, పెద్దగోని యాదయ్య, గోపయ్య, రాములు, ధర్మయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

కనగల్: ప్రజల పక్షాన సీపీఐ నిరంతరం పోరాడుతుందని సీపీఐ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో నాయకులు దోటి పాండారి, జోగు సురేందర్, జినుకుంట్ల లింగయ్య, ఆంజేయులు, తొరకొప్పుల నాగరాజు, నర్సింహ, ఎల్లయ్య పాల్గొన్నారు.

చిట్యాల: చిట్యాలలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు లొడంగి శ్రవణ్‌కుమార్ పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమం లో మండల కార్యదర్శి ఎండీ. అక్బర్, పట్టణ కార్యదర్శి ఎస్‌కె. షరీఫ్, నాయకులు జహంగీర్, బొల్గూరి లింగయ్య, దండిగ నర్సింహ, గుండాల సత్తయ్య, దేశగోని బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: మర్రిగూడ మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, సురేష్, రఘుమయ్య, నిరంజన్, యాదయ్య, మహేందర్, జంగయ్య, రవికుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరటి పండ్లు విక్రయిస్తూ ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన


కలెక్టరేట్ ఎదుట అరటిపండ్లు విక్రయిస్తూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నల్లగొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్ఏ ఉద్యోగుల చేపట్టిన సమ్మె గురువారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. ఉద్యోగులందరూ కలెక్టరేట్ కార్యాలయం వద్ద అరటిపండ్లను అమ్ముతూ నిరసన వ్యక్తం చేశారు. 17 రోజుల నుంచి వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం ఆశ్చర్యంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సేవలను గుర్తించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొలుగూరు కృష్ణ, బొమ్మగాని రాజు, గుమ్మల మంజుల, నీలాంబరి, వసంత, యాదయ్య, నాగరాజు, వెంకటకృష్ణ, పుష్పలత, నాగభూషణాచారి, రాజేంద్రప్రసాద్, వి.సైదులు, ఖాన్, బిక్షం, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి మాతృవియోగం


భాగ్యమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి, యూటీఎఫ్ నాయకులు



మాడ్గులపల్లి, నల్లగొండ క్రైం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి మాతృ వియోగం కలిగింది. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాతృమూర్తి అలుగుబెల్లి భాగ్యమ్మ (82) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు తన స్వగ్రామమైన మాడ్గులపల్లి మండలంలోని చర్లగూడెంలో గురువారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. విషయం తెలుసుకున్న ప్రజా సంఘాలు, సీపీఎం నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు గ్రామానికి చేరుకొని భాగ్యమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ భాగ్యమ్మ మృతి కుటుంబానికే కాకుండా పార్టీకి తీరని లోటన్నారు. నలుగురు కుమారులను ఉన్నత స్థానాలకు తీసుకొచ్చిందన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ఉపాధ్యక్షుడు సీహెచ్. రాములు, కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, వీఓటీటీ సంపాదకులు మాణిక్‌రెడ్డి, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, రెమడాల పరశురాములు, పాదూరు శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, రొండి శ్రీనివాస్, పుల్లెంల శ్రీకర్, పతాని శ్రీను, కుంచం మమత, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

కట్టంగూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. గురువారం కట్టంగూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసుల ను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ ఎ.రవీందర్, పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

తిప్పర్తి: పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ప్రతీ కేసును వెంటనే సరైన రీతిలో దర్యాప్తు చేసి పరిష్కరించాలని నల్లగొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌ను సీఐ కొండల్‌రెడ్డితో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది సెలవులు, స్టేషన్‌లో మౌలిక వసతులు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సాయిప్రశాంత్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

'యాచకులను ఆదుకోవాలి'

చిట్యాలరూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యాచకులను ఆదుకోవాలని ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ అన్నారు. మండలంలోని వట్టిమర్తి శివారులో గల షిర్డీ సాయిబాబా దేవాలయం వద్ద ఉన్న యాచకులకు గురువారం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హరికృష్ణ దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుఊత చలికాలంలో యాచకులు ఇబ్బందులు పడకుండా దుప్పట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పేదలు, గూడులేని అభాగ్యులను గుర్తించి వారికి తోచిన విధంగా సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇమ్మడి వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, గడగోజు ఎల్లాచారి, జాల నరేష్, ఓర్సు శ్రీధర్, అంజనపల్లి శివసాయి పాల్గొన్నారు.

ఘనంగా చార్లెస్ బాబేజ్ జయంతి

చిట్యాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ పితామహుడు చార్లెస్ బాబేజ్ జయంతిని గురువారం చిట్యాలలోని సిట్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబేజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిట్ కేంద్రం నిర్వాహకుడు గంజి శ్రీరామ్, గట్టోజు యశ్వంత్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆర్థికసహాయం

చిట్యాలరూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిమినేడుకు చెందిన బెర్ధ లింగమ్మ ఇటీవల మృతిచెందాడు. గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకురాలు అంతటి పారిజాతనర్సింహ పాల్గొని మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సుర్కంటి సత్తిరెడ్డి, మారగోని యాదయ్య, ఏనుగు పద్మారెడ్డి, గోలి గణేష్, దేశబోయిన మల్లేష్, గోలి మహేష్, చింతకింది వెంకటేష్, గోలి నరేష్, యాదయ్య, పాండు, ఆంజనేయులు, మహేష్ పాల్గొన్నారు.

దళితులపై దాడులను నియంత్రించాలి


కేంద్ర మంత్రి రామదాస్ అత్తా వలేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మస్తాన్

శాలిగౌరారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అణగారిన దళితుల కుటుంబాలపై దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర కార్యదర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి దేవరకొండ మస్తాన్ (జానయ్య) అన్నారు. మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి మస్తాన్ కేంద్ర న్యాయశాఖ మంత్రి, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు రామదాస్ అత్తా వలేను ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. దళిత కుటుంబాలపై దాడులను నియంత్రించాలని కోరారు. ఆయన వెంట తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవి, రాష్ట్ర మహిళా నాయకురాలు పుష్ప ఉన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.0 । కనిష్ఠం 19.0

మననం 2024

ఏడాదంతా రాజకీయమే

- కాంగ్రెస్‌లో నియామకాల సందడి
- నల్లగొండ ఎంపీగా రఘువీర్‌కు రికార్డు స్థాయి మెజార్టీ
- డీసీసీబీ చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నిక
- సూర్యాపేట, ఆలేరు మినహా మునిసిపాలిటీలన్నీ కాంగ్రెస్ ఖాతాలోకి
- జిల్లాలో అభివృద్ధి పనులు ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- మూసీ ప్రక్షాళనకు సంకల్ప యాత్ర
- కృష్ణాజలాలపై నల్లగొండలో మాజీ సీఎం కేసీఆర్ సభ



మూసీ ప్రక్షాళన సంకల్ప పాదయాత్రలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డి (ఫైల్)



కృష్ణానది జలాల హక్కుల పరిరక్షణ సభలో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్ (ఫైల్)

చూస్తుండగానే కాల చక్రం గిర్రున తిరిగింది. రాజకీయంగా మరచిపోలేని ఎన్నో ఘటనలను మిగిల్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక లోక్‌సభ ఎన్నికలు ఎదుర్కొంది. ఈ ఏడాది మార్చి 16 నుంచి జూన్ 16వ తేదీ వరకు లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంది. నల్లగొండ ఎంపీగా కుందూరు రఘువీర్‌రెడ్డి దక్షిణ భారత దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిచారు. ఆ తరువాత అక్టోబరు 7న శాసనమండలి పట్టభద్రుల స్థానానికి ఉప ఎన్నిక కోడ్ రాగా, నవంబరు 6న ఓట్ల లెక్కింపు నిర్వహించారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) గెలుపొందారు. తదనంతరం రాష్ట్ర కార్పొరేషన్ల మొదలు, మార్కెట్ కమిటీల నియామకాల వరకు నామినేటెడ్ పదవుల పందేరం కొనసాగింది. ఏడాది కాలమే ఉన్నా మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాల ద్వారా బీఆర్ఎస్ చైర్మన్లను గద్దెదించి మెజారిటీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకొంది. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల పాలకవర్గాలకు పదవీకాలం ఈ ఏడాదే ముగిసింది.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

•7లో..

భక్తుల మనోభీష్టమే ప్రధానం

- కొత్త ప్రభుత్వం రాకతో గుట్టపై పలు సౌకర్యాల కల్పన
- పాత ఆచారాల పునరుద్ధరణ, ప్రారంభమైన గిరి ప్రదక్షిణ
- దివ్య విమాన బంగారం తాపడం పనులు షురూ
- యాదగిరి క్షేత్రానికి భద్రతాపరంగా హైసెక్యూరిటీ
- తెలంగాణ తిరుపతిగా, ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా
- నృసింహుడి ఆలయానికి పెరుగుతున్న భక్తుల సంఖ్య



గుట్ట నృసింహుడి సన్నిధిలో అయ్యప్ప భక్తుల గిరిప్రదక్షిణ (ఫైల్)



గుట్ట ఆలయంలో భక్తుల రద్దీ (ఫైల్)

శతాబ్దాల చరిత్ర ఉన్న మహిమాన్విత స్వయంభు యాదగిరిగుట్ట దివ్యక్షేత్రం పునర్నిర్మాణం, ఉద్ఘాటన అనంతరం ఆధ్యాత్మిక నగరిగా కొత్తరూపు సంతరించుకుంది. నాటి నుంచి స్వామివారిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఇంకా కొన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిపై దృష్టిసారించింది. ఏళ్లుగా ఉన్న పాత ఆచారాలను పునరుద్ధరించింది. గతంలో స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు గుట్టపై నిద్రచేసి మొక్కు చెల్లించేవారు. ఆలయ ఉద్ఘాటన అనంతరం ఈ సౌకర్యం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం భక్తులు నిద్ర చేసేలా డార్మెటరీ హాల్‌ను అందుబాటులోకి తెచ్చింది. అదేవిధంగా ఏళ్లుగా కొనసాగిన గిరిప్రదక్షిణను తిరిగి ప్రారంభించింది. దీంతోపాటు కొండపైకి ఆటోలను అనుమతించారు. ఇక స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఏర్పాటుచేసిన పీటలపై ప్రొటోకాల్ వివాదం చెలరేగగా, అప్పటి వరకు ఉన్న ఆలయ ఈవో గీతారెడ్డిపై ప్రభుత్వం వేటు వేసింది.

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి

•6లో..

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- రేపు నల్లగొండలో జోడో ర్యాలీ, బహిరంగ సభ
- హాజరుకానున్న మంత్రి కోమటిరెడ్డి
- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల, మునిసిపల్ చైర్మన్ బుర్రి



ఆవిర్భావ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గుమ్ముల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

నల్లగొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 28న జిల్లా కేంద్రంలో జోడో ర్యాలీ, గడియారం సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పట్టణశాఖ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జోడో ర్యాలీ, బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటారని, బీజేపీ ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందన్నారరు. పదేళ్లుగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క వర్గానికి కూడా న్యాయం చేయలేదని విమర్శించారు. పార్టీ జాతీయ నాయకురాలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతోందన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏడాది కాలంగా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ ప్రజాపాలన సాగిస్తున్నారని తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతతత్వ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నాయకత్వంలో నల్లగొండ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, ఉమ్మడి జిల్లా అభివృద్ధితో పాటు రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఈనెల 28న మధ్యాహ్నం 3గంటలకు ఎన్‌జీ కళాశాల నుంచి ప్రతీ నాయకుడు, కార్యకర్త చేతిలో జెండా పట్టుకొని క్రమశిక్షణతో నడుచుకుంటూ ర్యాలీలో పాల్గొంటారన్నారు. ర్యాలీ శివాజీనగర్, రామగిరి, బస్టాండ్, ప్రకాశం బజార్ మీదుగా గడియారం సెంటర్‌కు చేరుకుంటుందని, సాయంత్రం 5గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ సభకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ మాట్లాడారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, నాయకులు వంగూరి లక్ష్మయ్య, గడ్డం అనూప్‌రెడ్డి, జూలకంటి సైదిరెడ్డి, నాగరాజు, సతీష్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా

- ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తాం
- 30న నల్లగొండలో రాష్ట్రస్థాయి బహిరంగ సభ
- జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వంపై ఒత్తిడి
- కాలుష్యరహిత, ఉపాధి కల్పనకు తోడ్పడే పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- 'ఆంధ్రజ్యోతి'తో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం



ఇంటర్వ్యూ Interview

నల్లగొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. సీపీఐ వందేళ్ల ప్రస్థానం నేపథ్యంలో ఈనెల 30న నల్లగొండలో పార్టీ రాష్ట్రస్థాయి బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్య రంగాల్లో సమస్యలు, పారిశ్రామిక కాలుష్యంపై పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే అంతిమ లక్ష్యంగా ముందుకెళ్తామంటున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో విశేషాలు ఇలా..

ఆంధ్రజ్యోతి: రాష్ట్రస్థాయి బహిరంగసభ ద్వారా ఇచ్చే సందేశమేంటి?

సత్యం: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీపీఐకి ఘనమైన ఉద్యమచరిత్ర ఉంది. నిజాం విముక్తి పోరాటం, తెలంగాణ సాయుధ పోరాటంలో జిల్లాలో సీపీఐదే అగ్రస్థానం. రాష్ట్రంలో అత్యధికంగా పేదలకు భూములు పంచిన సీపీఐ, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతోంది. దేశంలో పెచ్చరిల్లుతున్న మతతత్వ, కార్పొరేట్ శక్తులను నియంత్రించేందుకు ప్రజాస్వామికవాదులు, కమ్యూనిస్టులు ఐక్యంగా పోరాడాలనే సందేశాన్ని ఈ బహిరంగ సభ ద్వారా ఇవ్వనున్నాం.

ఆం: బహిరంగసభకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

సత్యం: బహిరంగసభకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి సీపీఐ కార్యకర్తలు తరలి వస్తారు. సుమారు 20వేలమంది వరకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో నిర్వహించే ఈ సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇతర ముఖ్యనేతలంతా రానున్నారు. కళాజాతాలు, ప్రదర్శనలుంటాయి. సభను విజయవంతం చేయడం ద్వారా ఉమ్మడి జిల్లాలో పార్టీ శ్రేణుల్లో పునరుత్తేజం కల్పిస్తాం.

ఆం: ఉమ్మడి జిల్లాలో మీ కార్యాచరణ ఏంటి?

సత్యం: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సీపీఐ మొదటి నుంచి పోరాడుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొంత కదలిక రావడం హర్షనీయం. కీలకమైన ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ పనులను వేగంగా పూర్తిచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం. అదేవిధంగా మూసీకాల్వల

మిగతా 8వ పేజీలో...

నేడు బెటాలియన్‌లో పాసింగ్ అవుట్ పరేడ్

హాజరు కానున్న ఐజీ రమేష్

నల్లగొండ క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికై నల్లగొండ పట్టణ పరిధిలోని 12వ బెటాలియన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శుక్రవారం ఉదయం పాసింగ్ అవుట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు 12వ బెటాలియన్ కమాండెంట్ కె.వీరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఎస్‌పీసీగా ఎంపికైన మొత్తం 450 మంది (వికారాబాద్ 107 మంది, కామారెడ్డి 129 మంది, రామగుండం 214 మంది) కానిస్టేబుళ్లకు తొమ్మిది నెలలుగా బెటాలియన్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. కఠోరమైన ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకున్నారని, ఈ కాలంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐజీ ఎం.రమేష్ హాజరవుతారని తెలిపారు. శుక్రవారం ఉదయం 8.15 గంటలకు దీక్షాంత్ పరేడ్ ప్రారంభంకానున్నట్లు తెలిపారు.

నేడు జిల్లాకు నారా భువనేశ్వరి

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



నల్లగొండ, దామరచర్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి నల్లగొండ జిల్లాకు శుక్రవారం రానున్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని దామచర్ల మండలం పుట్లగడ్డ తండాలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొననున్నారు. అదేవిధంగా ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడంతోపాటు ఎన్టీఆర్ సుజల వాటర్ ప్లాంట్‌ను నారా భువనేశ్వరి ప్రారంభిస్తారని టీడీపీ నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి తెలిపారు. నారా భువనేశ్వరి పాల్గొనే కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ●నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

దామరచర్ల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని వాడపల్లిలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించే స్వామివారి స్వాతి నక్షత్రం, మూడో మాస కల్యాణోత్సవంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గురువారం పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

దేవరకొండ డివిజన్‌లో రౌడీ మూకల ఆగడాలు




● సినీ ఫక్కీలో ద్విచక్రవాహనాలపై వచ్చి దాడులు ● బాధ్యులపై చర్యలు తీసుకుంటాం : డీఎస్పీ

దేవరకొండ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రలకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్‌శాఖ హెచ్చరిస్తున్నప్పటికీ దేవరకొండ డివిజన్‌లో మళ్లీ రౌడీ మూకల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. గతంలో చందంపేట, పీఏపల్లి మండలాల్లో రాజకీయ ఘర్షణలు, గొడవలు జరుగుతుండేవి. జిల్లా పోలీస్ అధికారుల ప్రత్యేక చొరవతో ఘర్షణలను ప్రోత్సహిస్తున్నవారిని, దాడులకు పాల్పడినవారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడంతో గొడవలు కొంతకాలంగా సద్దుమనిగాయి. పీఏపల్లి మండలంలో గతంలో మాజీ రౌడీషీటర్‌లు భూకబ్జాలు, దాడులకు పాల్పడేవారు. పోలీసులు పీడీయాక్టు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవడంతో మండలంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. గత కొన్నేళ్లుగా ప్రశాంతంగా ఉన్న దేవరకొండ పట్టణంతోపాటు తాటికోలులో ఇటీవల రౌడీ, అల్లరిమూకలు పరస్పర దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత మూడు నెలల క్రితం దేవరకొండలో మున్నాబాయ్, శివబాయ్, విక్రమ్ బాయ్‌ల పేర్లతో గ్రూపులుగా ఏర్పడి ఇరువర్గాలు కత్తులతో ఘర్షణలకు దిగిన ఘటనలు ఉన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేయడంతో ప్రస్తుతం దేవరకొండలో ప్రశాంత వాతావరణం నెలకొంది.

తొమ్మిది మంది బైక్‌లపై వచ్చి..

దేవరకొండ మండలం తాటికోలులో ఈ నెల 21న ఇంటి ఎదుట నిల్చొని సెల్‌ఫోన్ మాట్లాడుతున్న గ్రామానికి చెందిన పల్సా మహేష్‌పై అదే గ్రామానికి చెందిన తొమ్మిది మంది యువకులు దాడికి దిగారు. వెంట తెచ్చుకున్న కర్రలతో మహే‌ష్‌ను విచక్షణారహితంగా కొడుతుండగా, కేకలు వేయడంతో స్థానికులు వచ్చేలోపు నిందితులు పరారయ్యారు. చిన్న చిన్న సంఘటనలను దృష్టిలో పెట్టుకొని సినీఫక్కీలో ద్విచక్రవాహనాలపై వచ్చి దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తలకు తీవ్రగాయమైన మహేష్ హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మహేష్ తండ్రి పల్సా సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవరకొండ పోలీసులు తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకొని చర్యలు చేపడుతామని పోలీసులు తెలుపుతున్నారు. కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న పట్టణంతోపాటు గ్రామాల్లో సినీఫక్కీలో చిల్లర గ్యాంగ్‌లు మున్నాబాయ్, శివబాయ్, విక్రమ్‌బాయ్‌ల పేరుతో దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు భయపడుతున్నారు. దాడులకు పాల్పడుతున్నవారిపై గతంలో మాదిరిగానే చర్యలు తీసుకొని, ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

దాడులకు పాల్పడితే కఠిన చర్యలు



తాటికోలులో మహే‌ష్‌పై దాడి చేసిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేశాం. వారిపై చర్యలు చేపడుతాం. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. దేవరకొండ పట్టణంతోపాటు గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపడుతున్నాం. రౌడీ, అల్లరిమూకలపై నిఘా ఏర్పాటు చేశాం.

గిరిబాబు, దేవరకొండ డీఎస్పీ

కాంగ్రెస్ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా యాదగిరిరెడ్డి



కత్తి యాదగిరిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నేతాపురం గ్రామానికి చెందిన కత్తి యాదగిరిరెడ్డి నియమితులయ్యారు. గురువారం ఆయన స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి నుంచి నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మేకల సాగర్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఐ వందేళ్లుగా ప్రజలపక్షాన పోరాడుతోంది

● కేంద్రంలోని బీజేపీ పేదల నడ్డి విరిస్తూ.. కార్పొరేట్‌కు కొమ్ము కాస్తోంది ● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి



దేవరకొండలో పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి, పక్కన పార్టీ కార్యకర్తలు

దేవరకొండ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్లుగా ప్రజలపక్షాన పోరాడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. గురువారం దేవరకొండ సీపీఐ కార్యాలయంలో సీపీఐ వందో ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబరు 26న ఆవిర్భవించిందని నేటితో వందో ఏడాదిలోకి అడుగు పెట్టిందన్నారు. దేశంలో వంద సంవత్సరాల ఉద్యమ పార్టీగా సీపీఐ ఖ్యాతి పొందిందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో అనేక మంది ఉరికంబాలు ఎక్కి ప్రాణత్యాగాలు చేశారని అన్నారు. దేశంలోని రైతుల కోసం వ్యవసాయ సంస్కరణలు, కార్మిక చట్టాలు, బొగ్గుగనులు, బ్యాంక్‌లు, బీమారంగం, ఆర్టీసీ వంటి సంస్థలను జాతీయ కరుణ కోసం పోరాడిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికై సీపీఐ ప్రజలపక్షాన పోరాటాలు చేస్తునే ఉందన్నారు. తెలంగాణ సాధనలో ప్రముఖపాత్ర సీపీఐ పోషించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కేశవరెడ్డి, మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, నూనె రామస్వామి, వలమాల ఆంజనేయులు, జూలూరి వెంకట్రాములు, యాదయ్య, ఫైనొద్దిన్ పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ జెండాను మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో సీపీఐ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, ఉజ్జిని అంజన్‌రావు, శేఖరాచారి, లక్ష్మయ్య, శంషుద్దీన్, పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ

కొండమల్లేపల్లి: సీపీఐ 100వ ఆవిర్భావ వేడుకలను గురువారం కొండమల్లేపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని చింతకుంట్ల, చిన్నమనేనిపల్లి, చెన్నారం గ్రామాల్లో పార్టీ జెండాలను పార్టీ నేతలు ఎగురవేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల, కర్షకుల కోసం నిరంతరం పోరాడే ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. కేంద్రంలోని బీజేపీ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందన్నారు. అన్ని రంగాలపై జీఎస్టీ విధిస్తూ అన్నివర్గాల ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకోసం లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఈ నెల 30న జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో శేఖరాచారి, శ్రీనివాస్, చరణ్‌రెడ్డి, సోమ్లానాయక్, ధర్మయ్య, వెంకటయ్య, వీరస్వామి, ఇద్దయ్య, లక్ష్మయ్య, కాశయ్య పాల్గొన్నారు.

పార్టీ జెండా ఆవిష్కరణ

దామరచర్ల: సీపీఐ శత వసంతోత్సవాల సందర్భంగా పార్టీ జెండాను గురువారం పార్టీ మండల కార్యదర్శి ధీరావత్ లింగా నాయక్ మండలకేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ శత వసంత ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎండీ సయ్యద్, వెంకన్న, ధీరావత్ శాంత, జమ్ముల కోటయ్య, పోలెపల్లి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్
PUBLIC DEMAND

తొలగించిన బస్‌షెల్టర్ నిర్మించేదెన్నడో?



బస్సులకోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

నిడమనూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముకుందాపురం గ్రామంలో బస్ షెల్టర్లు లేక పోవడంతో వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముకుందాపురం గ్రామం కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై ఉండటంతో పాటు నిడమనూరు, త్రిపురారం, మాడ్గులపల్లి, తిరుమలగిరిసాగర్ మండలాల్లోని అనేక గ్రామాలకు కూడలి కూడా అయినందున ముకుందాపురంలో నిత్యం బస్సుల కోసం ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగింది. కానీ గ్రామంలో కనీసం ఒక్కచోటైనా బస్ షెల్టర్ లేదు. దీంతో ప్రయాణికులు ఎండైనా, వానైనా రోడ్డుపై నిలబడి ఉండాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో గంటల తరబడి బస్సుల కోసం రోడ్డు మీద నిలబడి ఎదురుచూడాల్సి వస్తున్నందున వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, చిన్నపిల్లలు అవస్థలు పడుతున్నారు. కనీసం బస్సులు వచ్చే వరకైనా కూర్చుందామంటే ఎక్కడా వీలు లేని పరిస్థితి ఉంది. అదే విధంగా ముకుందాపురంలో తొలగించిన బస్ షెల్టర్‌ను మరోచోట నిర్మించే విషయమై వివరణ కోరేందుకు హైవే డీఈ బాలానాయక్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

బస్‌షెల్టర్ లేకపోవడంతో ఇబ్బందులు



ముకుందాపురంలో బస్‌షెల్టర్ లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. బస్సులు వచ్చే వరకు ఎండకు, వానకు నిలబడి ఎదురుచూడాల్సివస్తుంది. కనీసం కూర్చునేందుకు కూడా వీలు లేని పరిస్థితి ఉంది. సత్వరమే బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కత్తి కృష్ణారెడ్డి, ముకుందాపురం

ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి మాతృవియోగం





అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి,(ఇన్‌సెట్‌లో) భాగ్యమ్మ(ఫైల్)

మాడ్గులపల్లి, నల్లగొండ క్రైం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి మాతృ వియోగం కలిగింది. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాతృమూర్తి అలుగుబెల్లి భాగ్యమ్మ (82) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు తన స్వగ్రామమైన మాడ్గులపల్లి మండలంలోని చర్లగూడెంలో గురువారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. విషయం తెలుసుకున్న ప్రజా సంఘాలు, సీపీఎం నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు గ్రామానికి చేరుకొని భాగ్యమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ భాగ్యమ్మ మృతి కుటుంబానికే కాకుండా పార్టీకి తీరని లోటన్నారు. నలుగురు కుమారులను ఉన్నత స్థానాలకు తీసుకొచ్చిందన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య, ఉపాధ్యక్షులు సీహెచ్.రాములు, కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, వీఓటీటీ సంపాదకులు మాణిక్‌రెడ్డి, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, రెమడాల పరశురాములు, పాదూరు శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, రొండి శ్రీనివాస్, పుల్లెంల శ్రీకర్, పఠాని శ్రీను, కుంచం మమత, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేయాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

దేవరకొండ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేయాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం దేవరకొండలో బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రతీ పౌరునికి సమాన హక్కులను కల్పించిందన్నారు. ఇతర రాష్ట్రాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన లేదన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆంక్షలు లేకుండా అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఏకుల రాజారావు, బీసీ సంక్షేమసంఘం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చందునాయక్, చొల్లేటి భాస్కరచారి, కృష్ణచారి, సైదులు, చంద్రమౌళి, లింగాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా

(5వ పేజీ తరువాయి)

పనులు వేగంగా పూర్తిచేయాలని కోరుతున్నాం.

ఆం: జిల్లాలో ఇతర సమస్యలపై మీ ఉద్యమ కార్యాచరణ?

సత్యం: జిల్లాలో స్థానిక నిరుద్యోగులకు, యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలు రావాల్సి ఉంది. దురదృష్టవశాత్తు మనం ఆశించనిరీతిలో కాలుష్యకారక ఫార్మా పరిశ్రమలు ఉమ్మడి జిల్లాకు ఎక్కువగా వస్తున్నాయి. ఇప్పటికే చౌటుప్పల్ మండలం పూర్తిగా కాలుష్యభరితమైంది. మునుగోడు నియోజకవర్గంలో ఇవి విస్తరిస్తున్నాయి. వందలాది పరిశ్రమలు అనుమతుల కోసం వేచి చూస్తున్నాయి. మేం వీటికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నాం. భవిష్యత్ తరాల క్షేమం కోసం ఈ పరిశ్రమలపై జరిగే పోరాటంలో స్థానిక ప్రజానీకం భాగస్వాములవ్వాలని కోరుతున్నాం.

ఆం: ఎలాంటి పరిశ్రమలు రావాలని ఆశిస్తున్నారు?

సత్యం: జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా, ఇక్కడి వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసేందుకు అవసరమైన పరిశ్రమలు ఏర్పాటు చేస్తే కాలుష్యం బెడద ఉండదు. అంతేగాక స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కుతాయి. ఐటీ హబ్‌లో కంపెనీలు ఏర్పాటు చేయడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం సూచిస్తున్నట్లు ద్వితీయశ్రేణి పట్టణాల్లో ఐటీ, గ్రీన్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. అదేవిధంగా ఉమ్మడి జిల్లా హైదరాబాద్‌కు సమీపంలో ఉండడంతో కూరగాయల పెంపకంతో పాటు, ప్రాసెసింగ్‌కు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఇటీవల జిల్లాలో ఆయిల్‌పామ్ తోటల పెంపకం ప్రారంభమైంది. దీనికి అనుగుణంగా ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

జనార్ధన్‌రెడ్డి మృతి బాధాకరం

● మాజీ ఎమ్మెల్యే రవీంద్ర



జనార్ధన్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న రవీంద్ర కుమార్

చందంపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ముడుదండ్ల మాజీ ఎంపీటీసీ, సీపీఐ సీనియర్ నాయకుడు పందిరి జనార్ధన్‌రెడ్డి మృతి బాధాకరమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం చందంపేట మండలం ముడుదండ్ల గ్రామానికి చెందిన పందిరి జనార్ధన్‌రెడ్డి మృతి చెందడంతో మృతదేహం వద్ద నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు యాసాని రాజవర్ధన్‌రెడ్డి, ముడుదండ్ల మాజీ ఎంపీటీసీ బాలవర్ధిరాజు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న యువకులు

కొండమల్లేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లికి చెందిన జె.పుష్పలత ఎనిమిదేళ్ల క్రితం కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతిచెందారు. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరి విద్య, ఇతర అవసరాల నిమిత్తం గ్రామానికి చెందిన పలువురు యువకులు సేకరించిన రూ.6వేలను గురువారం ఇద్దరు పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రచార కార్యదర్శి ఆదిరాల రమేష్, వసుకుల బాలకృష్ణ, కొండపల్లి సుందర్‌పాల్, గ్యార యాదగిరి, ఆదిరాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేస్తున్న డీవైఎస్‌వోలు

నల్లగొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ బాలబాలికల జట్ల క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని నల్లగొండ డీఎస్‌వైవో కుంభం నర్సిరెడ్డి, యాదాద్రి భువనగిరి డీఎస్‌వైవో ధనుంజయ అన్నారు. రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ బాలబాలికల జట్ల క్రీడాకారులకు వారు అభినందించారు. అనంతరం హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాలయల పుల్లయ్య సహకారంతో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. పోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కవిత, చైతన్యకుమార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీ ఎన్నికలే పార్టీకి పునాది

● బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమిరెడ్డి భిక్షంరెడ్డి

నల్లగొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బూత్ కమిటీ ఎన్నికలే పార్టీకి పునాది అని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమిరెడ్డి భిక్షంరెడ్డి అన్నారు. పట్టణంలోని 17వ వార్డులో నిర్వహించిన 161 బూత్ కమిటీ ఎన్నికల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని సూచించారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా తీగల శ్రవణ్‌కుమార్, కార్యదర్శిగా యాదగిరి ఎన్నికయ్యారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిమార్గంలో నడవాలి

మద్దిమడుగు ఆంజనేయస్వామి దేవాలయ పీఠాధిపతి జయరాం గురుస్వామి



విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం మాట్లాడుతున్న జయరాం గురుస్వామి

దేవరకొండ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ భక్తిమార్గంలో నడవాలని మద్దిమడుగు ఆంజనేయస్వామి దేవాలయ పీఠాధిపతి కేతావత్ జయరాం గురుస్వామి అన్నారు. గురువారం దేవరకొండలో మద్దెలమ్మ తల్లి దేవాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. భయాన్ని పోగొట్టేది భగవంతుడే అన్నారు. ఆంజనేయస్వామిని స్మరించుకుంటే అంతా మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దేవరకొండ మాజీ ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, నక్క వెంకటేష్ యాదవ్, ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీన్ కుమార్‌శర్మ, హరీష్‌రెడ్డి, హారిక, నూకల రాజేందర్‌రెడ్డి, అరుణ, శ్రీకాంత్, రూప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



మహాపడి పూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

చింతపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్‌లోని అయ్యప్ప మహాపడిపూజను భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా నిర్వహించారు. చింతపట్ల గ్రామానికి చెందిన పోలే గిరి ప్రణీతల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు వైద్యుల ప్రవీణ్‌శర్మ, మల్లోజు జగతయ్య, మట్ట యాదయ్య, కాసోజు ప్రేమనందాచారి, సంతోష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఏపీ సీఎంను కలిసిన వూరె లక్ష్మణ్

చింతపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వరనగర్ దేవస్థాన కమిటీ చైర్మన్ వూరె లక్ష్మణ్ గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల అభివృద్ధికి సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు.